# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 139 | పేజీలు : 08 | బుధవారం | 27-05-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


# కాల్చేసే ఎండ, వడగాలులు



**హైదరాబాద్ పల్స్,హైదరాబాద్**

వేసవి రాకతో సూర్యుడు మండుటెండలతో తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఒకవైపు తీవ్రమైన ఎండలు, మరోవైపు వడగాలుల మధ్య నలిగిపోతూ ప్రజలు ప్రతిరోజూ బాధపడుతున్నారు. బయటకు వెళ్లటానికి కూడా భయపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైతం ఈ వేడిని తట్టుకోలేక ఇబ్బంది పడుతుంటే, పట్టణవాసుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది.

**పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ**

తెలంగాణపై ప్రచండ భానుడు ఉగ్రరూపం ప్రదర్శిస్తున్నాడు. ఒక వైపు తీవ్రమైన ఎండ మరోవైపు అతి తీవ్రమైన వడగాల్పులు, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలపై ఎండల తీవ్రత అధికంగా ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఇవాళ ఎండ తీవ్రత అధికంగా ఉండే ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మంతో పాటు నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబ్‌బాద్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. మిగితా అన్ని జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది.

రేపు ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మంతో పాటు నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేయగా మిగితా అన్ని జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది వాతావరణశాఖ. ఎల్లుండి ఉమ్మడి ఖమ్మంతో పాటు కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్, మహబూబ్ బాద్, సూర్యపేట, నల్గొండ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. మిగితా అన్ని జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను వాతావరణ శాఖ జారీ చేసింది. మూడు రోజుల తరువాత గరిష్ఠ ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఇవాళ, రేపు అతి తీవ్రమైన ఎల్లుండి తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం ఉన్నట్లు ప్రకటించింది. ఇవాళ అతి తీవ్రమైన



## మరిన్ని బయటపెడతా

**సింగరేణిపై కాంగ్రెస్ అక్రమాలు మరిన్ని బయటపెడతా: హరీష్ రావు**

**హైదరాబాద్ పల్స్,హైదరాబాద్**

శంషాబాద్ సమీపంలోని 180 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. ఈ స్కాంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నిహితుడి పాత్ర ఉందని ఆరోపించారు. ఈ

## పంట అవశేషాలను కాల్చొద్దు : మంత్రి తుమ్మల

**హైదరాబాద్ పల్స్,హైదరాబాద్**

రైతులు పంట అవశేషాలను కాల్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. పంట వ్యర్థాలను తగలబెట్టడం రైతుల భవిష్యత్తుకే ప్రమాదమని ఆయన హెచ్చరించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం పూర్తిగా దెబ్బతింటుందని, నేలలోని పోషకాలు తగ్గిపోవడంతో యూరియా, పురుగుమందుల ప్రభావం కూడా తగ్గిపోతుందని మంత్రి తెలిపారు.



## రియల్ ఎస్టేట్ కుదేలైంది

- ఇందిరమ్మ ఇళ్ల పేరుతో కాంగ్రెస్ మోసం:రాంచందర్ రావు
- తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందన్న రాంచందర్ రావు
- హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు ముక్కలు చేశారని మండిపాటు
- కాంగ్రెస్ ప్రభుత్వానికి మజ్లిస్ పార్టీయే ముఖ్యమని వ్యాఖ్య



## సైబర్ కేటుగాడి ఫేక్ కాల్..

- రాజాసింగ్‌కు సైబర్ కేటుగాడి ఫేక్ కాల్.. ప్రమాదం నుంచి తప్పించుకున్న రాజాసింగ్!
- ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో అడిషనల్ సెక్రటరీ దిలీప్ అని పరిచయం చేసుకున్న కేటుగాడు
- డిప్యూటీ సీఎం పీఏకు ఫోన్ చేసి అలాంటి వ్యక్తి ఎవరూ లేరని నిర్ధారించుకున్న రాజాసింగ్
- ఎమ్మెల్యేలు అప్రమత్తంగా ఉండాలని రాజాసింగ్ హెచ్చరిక

## ఇజ్రాయెల్‌తో దోస్తీ కుదరదు..

**ట్రంప్ ప్రతిపాదనకు నో చెప్పిన పాకిస్థాన్**



- అబ్రహం ఒప్పందంలో చేరాలని ట్రంప్ పిలుపు
- అమెరికా ప్రతిపాదనను తిరస్కరించిన పాకిస్థాన్
- ఇజ్రాయెల్‌తో చర్చలు అసాధ్యమన్న పాక్ రక్షణ మంత్రి
- పాలస్తీనాకు మద్దతుగా నిలిచిన సౌదీ అరేబియా
- ఇరాన్ శాంతి చర్చల నేపథ్యంలో ట్రంప్ కొత్త మెలిక

**హైదరాబాద్ పల్స్,డెస్క్**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకొచ్చిన 'అబ్రహం ఒప్పందం' ప్రతిపాదనను పాకిస్థాన్ తిరస్కరించింది. ఇజ్రాయెల్‌తో సంబంధాలను సాధారణీకరించుకోవాలంటూ ట్రంప్ చేసిన విజ్ఞప్తిని తాము ఏమాత్రం అంగీకరించబోమని స్పష్టం చేసింది. ఇరాన్‌తో కుదుర్చుకోబోయే శాంతి ఒప్పందంలో భాగంగా సౌదీ అరేబియా, ఖతార్, టర్కీ, ఈజిప్ట్, జోర్డాన్‌తో పాటు

## పుణ్యం మాట దేవుడెరుగు..

**రోగాలు మాత్రం కచ్చితంగా వస్తాయి: పవన్ కల్యాణ్**

- రాజమండ్రిలో పుష్కర ఏర్పాట్లను పరిశీలించిన పవన్
- గోదావరిలో కాలుష్య పరిస్థితిపై స్వయంగా తనిఖీలు
- ఆంధ్ర పేపర్ మిల్స్ వ్యర్థాలు నదిలో కలిసే ప్రాంతానికి బోటులో వెళ్లిన పవన్



**హైదరాబాద్ పల్స్,డెస్క్**

రాజమండ్రిలో గోదావరి పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రెండో రోజు కూడా క్షేత్రస్థాయిలో కాలుష్య పరిస్థితిపై తనిఖీలు చేపట్టారు. వెంకటనగరం సమీపంలోని ఆంధ్ర పేపర్ మిల్స్ నుంచి పారిశ్రామిక వ్యర్థాలు నదిలో కలిసే ప్రాంతాన్ని ఆయన బోటులో వెళ్లి స్వయంగా పరిశీలించారు. అక్కడ అధికారులతో నీటి నమూనాలను (శాంపిల్స్)

## లొంగిపోయిన మావోయిస్టు దంపతులు..

**చెక్కులు అందజేసిన డీజీపీ**



**హైదరాబాద్ పల్స్,హైదరాబాద్**

మావోయిస్టు పార్టీలో నాలుగున్నర దశాబ్దాల పాటు పసునూరి నరహరి అలియాస్ సంతోష్ పని చేశారని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో మీడియా ఎదుట నరహరితోపాటు ఆయన భార్య ధనమ్మను తెలంగాణ పోలీసులు ప్రవేశపెట్టారు. లొంగిపోయిన వారిద్దరికి రూ. 25 లక్షలు, రూ.20 లక్షలు చొప్పున డీజీపీ చెక్కులు




## సాయుధ పోరాటం కష్టం

**ప్రస్తుత పరిస్థితుల్లో సాయుధ పోరాటం కష్టం: లొంగిపోయిన మావోయిస్టు నరహరి**

**హైదరాబాద్ పల్స్,హైదరాబాద్**

ప్రస్తుత పరిస్థితుల్లో మావోయిస్టులు చేపట్టిన సాయుధ పోరాటం కష్టంగా మారిందని ఆ పార్టీ కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు పసునూరి నరహరి వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లో మాజీ మావోయిస్టులు నరహరితోపాటు ఆయన భార్య ధనమ్మను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ సమక్షంలో మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా లొంగిపోయిన నరహరి మీడియాతో మాట్లాడుతూ.. జార్ఖండ్, తెలంగాణతోపాటు మిగతా ప్రాంతాల్లో సాయుధ పోరాటం పరంగా అనేక నష్టాలు చేశామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం కల్పించిన అవకాశాలు కారణంగానే తాము ప్రజా జీవితంలోకి వచ్చామని స్పష్టం చేశారు. జార్ఖండ్‌లోని మావోయిస్టు పొలిట్ బ్యూరో సభ్యుడు మిసిరి బిశ్రా అనుమతితోనే తాము ప్రజా జీవితంలోకి వచ్చామని తెలిపారు. తెలంగాణ ప్రజల

## మా కుమార్తె కేసులో న్యాయం చేయండి

**జగన్‌ను వేడుకున్న సుగాలి ప్రీతి తల్లిదండ్రులు!**

- 2017లో హత్యాచారానికి గురైన సుగాలి ప్రీతి
- తమకు న్యాయం జరగలేదన్న ప్రీతి తల్లిదండ్రులు
- కేసును పక్కన పెట్టేశారని ఆవేదన
- అండగా ఉంటామని భరోసా ఇచ్చిన జగన్



## ప్రధాని మోదీకి సీఎం విజయ్ లేఖ

- కావేరీ నదిపై కొత్త వివాదం
- కర్ణాటక డ్యామ్ ప్రతిపాదనకు తమిళనాడు వ్యతిరేకత
- మేకేదాటు ప్రాజెక్టును నిలిపివేయాలని డిమాండ్
- త్వరలోనే ఢిల్లీ వెళ్లనున్న సీఎం విజయ్
- దిగువ రాష్ట్రాల అనుమతి తప్పనిసరని వ్యాఖ్య

**హైదరాబాద్ పల్స్,డెస్క్**

కావేరీ నది నీటి పంపకాల వివాదం మళ్లీ రాజుకుంది. కర్ణాటక కొత్త డ్యామ్ పనులకు సిద్ధమవడంతో తమిళనాడు అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ప్రాజెక్టును ఆపాలని కోరుతూ ప్రధానమంత్రికి తమిళనాడు ముఖ్యమంత్రి



# రియల్ ఎస్టేట్ కుదేలైంది

మొదటి పేజీ రువాయి

ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తోందని ధ్వజమెత్తారు. గత కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో మోసం చేయగా, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే బాటలో నడుస్తూ పేదలకు తీవ్ర అన్యాయం చేస్తోందని మండిపడ్డారు.ఎంఐఎం ఒత్తిడికి లొంగి హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు ముక్కలు చేశారని దుయ్యబట్టారు. నగరంలో డివిజన్ల ఏర్పాటుపై అధికారులకే క్లారిటీ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మజ్లిస్ పార్టీయే ముఖ్యమని, నగర ప్రజలు కాదని విమర్శించారు. భాగ్యనగరంలో తాగునీటి ఎద్దడి, కాలుష్య నియంత్రణపై ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, చిన్న వాన పడితేనే నగరం మునిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు.గత బీఆర్ఎస్ పాలనలో నేతలు రియల్ ఎస్టేట్ పేరుతో జేబులు నింపుకోగా, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో ఆ రంగం పూర్తిగా కుదేలైందని రామచందర్ రావు ఆరోపించారు. హైదరాబాద్‌ను నిజమైన విశ్వనగరంగా మార్చడం, అవినీతి రహిత పాలన అందించడం ఒక్క బీజేపీకే సాధ్యమని స్పష్టం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పి, బీజేపీని గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

# సైబర్ కేటుగాడి ఫేక్ కాల్..

మొదటి పేజీ రువాయి

సెలబ్రిటీల నుండి సామాన్యుల వరకు చాలామందిని సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను లక్ష్యంగా చేసుకుని కుచ్చుటోపీ పెట్టేందుకు ప్రయత్నించారు. ప్రభుత్వ ఉన్నతాధికారిగా పరిచయం చేసుకుని ఒక గుర్తు తెలియని వ్యక్తి మోసానికి తెరలేపగా, అప్రమత్తమైన రాజాసింగ్ తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఈ ఫేక్ కాల్ ఉదంతంపై ఆయన స్వయంగా ఒక వీడియోను విడుదల చేసి వివరాలు వెల్లడించారు.రాజాసింగ్ తెలిపిన వివరాల ప్రకారం... నిన్న సాయంత్రం ఆయనకు ఒక గుర్తు తెలియని నంబర్ నుంచి కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి తాను ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో అడిషనల్ సెక్రటరీ దిలీప్ కుమార్‌ని అంటూ పరిచయం చేసుకున్నాడు. "ప్రధాన మంత్రి వికసిత్ భారత్" పథకం కింద తెలంగాణలో ప్రతి నియోజకవర్గానికి రూ.3 కోట్లు మంజూరయ్యాయని, దీని ద్వారా నియోజకవర్గ యువతకు 50 శాతం సబ్సిడీతో రూ.10 లక్షల రుణాలు ఇస్తామని నమ్మబలికాడు. అన్నింటిలో ముందుండే మీరు ఈ స్కీమ్‌కు ఎందుకు అప్లై చేయలేదని ప్రశ్నిస్తూ.. ఇవాళ రాత్రిలోపే ఆధార్ కార్డ్ వివరాలు పంపాలని ఒత్తిడి చేశాడు.ఈ గడువు విధింపుతో అనుమానం వచ్చిన రాజాసింగ్... వెంటనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పీఏకు ఫోన్ చేసి క్రాస్ చెక్ చేసుకున్నారు. ఆర్థిక శాఖలో దిలీప్ కుమార్ అనే అధికారి ఎవరూ లేరని, అసలు అలాంటి స్కీమే లేదని తేలడంతో అది ఫేక్ కాల్ అని నిర్ధారించుకున్నారు. నియోజకవర్గ ప్రగతి కోసమని ఆశపడి ప్రజాప్రతినిధులు ఇలాంటి మోసాల బారిన పడే ప్రమాదం ఉందని, రెండు తెలుగు రాష్ట్రాల ఎమ్మెల్యేలు అప్రమత్తంగా ఉండాలని రాజాసింగ్ హెచ్చరించారు. ఈ సైబర్ నేరగాడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.

# మా కుమార్తె కేసులో న్యాయం చేయండి

మొదటి పేజీ రువాయి

గత తొమ్మిదేళ్లుగా తమ కుమార్తె కేసులో న్యాయం కోసం పోరాడుతున్న సుగాలి ప్రీతి తల్లిదండ్రులు పార్వతి, రాజు నాయక్‌లు వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌ను కలిసి తమ ఆవేదనను పంచుకున్నారు. 2017లో తమ కుమార్తెపై అత్యంత దారుణంగా అత్యాచారం చేసి, హత్య చేశారని.. ఇన్నేళ్లు గడుస్తున్నా తమకు ఇంకా న్యాయం జరగలేదని వారు జగన్ ఎదుట కన్నీరు పెట్టుకున్నారు.ఆనాడు వైసీపీ ప్రభుత్వం తమ కుటుంబానికి కర్నూలులో 5 సెంట్ల ఇంటి స్థలం, 5 ఎకరాల వ్యవసాయ భూమితో పాటు ప్రీతి తండ్రికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అండగా నిలిచిందని చెప్పారు. అయితే, ప్రస్తుతం ఈ కేసును పూర్తిగా పక్కనపెట్టేశారని ఆరోపించారు. అంతేకాకుండా, తమకు రావాల్సిన పెన్షన్‌ను కూడా స్థానిక అధికారులు నిలిపివేశారని, కేటాయించిన స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు సాయం అడిగినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జగన్ దృష్టికి తీసుకెళ్లారు. సీబీఐ విచారణ వేగవంతమయ్యేలా తమకు న్యాయ సహాయం అందించాలని వారు కోరారు.బాధిత తల్లిదండ్రుల గోడును సావధానంగా విన్న జగన్, సుగాలి ప్రీతి కుటుంబానికి అన్ని విధాలా న్యాయ సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ తరపున లీగల్ సపోర్ట్ ఇస్తామని, భవిష్యత్తులోనూ ఆ కుటుంబానికి వైసీపీ అండగా ఉంటుందని జగన్ భరోసా కల్పించారు.

# ఇజ్రాయెల్‌తో దోస్తీ కుదరదు..

మొదటి పేజీ రువాయి

పాకిస్థాన్ కూడా అబ్రహం ఒప్పందంపై సంతకం చేయడం తప్పనిసరి అని ట్రంప్ సోషల్ మీడియా వేదికగా పేర్కొనడంతో ఈ వివాదం మొదలైంది.

**మా సిద్ధాంతాలకు వ్యతిరేకం**

ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై పాక్ రక్షణ మంత్రి ఖవాజా ముహమ్మద్ ఆసిఫ్ ఘాటుగా స్పందించారు. "మా దేశ ప్రాథమిక సిద్ధాంతాలు, ఆదర్శాలకు విరుద్ధంగా ఉండే ఎలాంటి ఒప్పందాల్లోనూ పాక్ భాగస్వామి కాబోదు. ఒక్క రోజు కూడా మాట మీద నిలబడని, నమ్మకద్రోహానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఇజ్రాయెల్‌తో మేం కలిసి కూర్చోవడం అసాధ్యం" అని ఆయన తేల్చి చెప్పారు. తమ దేశ అధికారిక విధానం ప్రకారం ఇజ్రాయెల్‌ను ఒక దేశంగా గుర్తించే ప్రసక్తే లేదని తెలిపారు.

**లంకె లేదు**

ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' పోస్ట్‌లో.. ఇరాన్‌తో అమెరికా జరుపుతున్న చర్చలు ఒక కొలిక్కి వస్తున్నాయని, ఈ చారిత్రాత్మక ఒప్పందంలో భాగం కావాలంటే ముస్లిం దేశాలన్నీ ఇజ్రాయెల్‌తో సత్సంబంధాలు పెట్టుకోవాల్సిందేనని షరతు పెట్టారు. దీనిపై పాకిస్థాన్ ప్రభుత్వ వర్గాలు మండిపడుతున్నాయి. ఇరాన్‌తో దౌత్యపరమైన చర్చలకు, అబ్రహం ఒప్పందానికి ఎలాంటి సంబంధం లేదని, ఎవరో ఒత్తిడి తెచ్చారని లొంగిపోయే పరిస్థితిలో పాక్ లేదని ఆ వర్గాలు స్పష్టం చేశాయి.

**సౌదీ అరేబియా కూడా**

సౌదీ అరేబియా కూడా ట్రంప్ ప్రతిపాదనను తోసిపుచ్చింది. స్వతంత్ర పాలస్తీనా దేశ ఏర్పాటుకు సంబంధించి స్పష్టమైన, శాశ్వతమైన మార్గం సుగమం అయ్యే వరకు ఇజ్రాయెల్‌తో చేతులు కలిపేది లేదని సౌదీ పేర్కొంది. గాజాపై ఇజ్రాయెల్ జరుపుతున్న సైనిక దాడుల పట్ల ముస్లిం దేశాల ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్న తరుణంలో ఈ అబ్రహం ఒప్పందాన్ని విస్తరించాలనే ట్రంప్ ఆశలకు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లయింది.

**ఏంటి ఈ అబ్రహం ఒప్పందం?**

ఇజ్రాయెల్, అరబ్ దేశాల మధ్య దశాబ్దాలుగా ఉన్న శత్రుత్వాన్ని ముగించి.. దౌత్య, ఆర్థిక, రక్షణ సంబంధాలను మెరుగుపరిచేందుకు 2020లో ట్రంప్ ఆధ్వర్యంలో ఈ 'అబ్రహం అకార్డ్స్' ప్రారంభమయ్యాయి. మొదట యూఏఈ, బహ్రెయిన్ ఈ ఒప్పందంపై సంతకాలు చేయగా.. ఆ తర్వాత మొరాకో, సూడాన్, కజకిస్థాన్ ఇందులో చేరాయి. పాలస్తీనా సమస్యను పక్కనబెట్టి కేవలం వ్యాపార, ప్రాంతీయ రక్షణే ధ్యేయంగా ఈ కూటమి పనిచేస్తోంది.

# పుణ్యం మాట దేవుడెరుగు..

మొదటి పేజీ రువాయి

సేకరింపజేశారు. ఈ సందర్భంగా పవన్ తో పాటు మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ కూడా ఉన్నారు.ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. "పవిత్ర గోదావరిలో పారిశ్రామిక వ్యర్థాలు కలవడం దారుణం. పుష్కరాల వేళ ఈ నీటిలో స్నానం చేస్తే పుణ్యం మాట దేవుడెరుగు... రోగాలు మాత్రం కచ్చితంగా వస్తాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఏలూరులో తాగునీటి కాలుష్యం కారణంగా జరిగిన ప్రమాదాలను గుర్తు చేస్తూ, రాష్ట్ర ప్రగతికి పరిశ్రమలు ఎంత అవసరమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు.ఈ కాలుష్య సమస్యపై త్వరలోనే అసెంబ్లీ, కేబినెట్ సమావేశాల్లో చర్చిస్తామన్నారు. పుష్కరాల రేవులను కేవలం అందంగా తీర్చిదిద్దడమే కాదు, నది కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత కూడా ఉందని మంత్రి కందుల దుర్గేష్‌ను ఉద్దేశించి పవన్ అన్నారు. పేపర్ మిల్స్ కాలుష్యంపై తాము నిఘా ఉంచామని, అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు.

# ప్రధాని మోదీకి సీఎం విజయ్ లేఖ..

మొదటి పేజీ రువాయి

విజయ్ అత్యవసర లేఖ రాశారు.మేకెదాటు దగ్గర కర్ణాటక ప్రభుత్వం డ్యామ్ నిర్మించాలని చూస్తోంది. ఈ ప్రతిపాదనను తిరస్కరించాలని సీఎం విజయ్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. కర్ణాటక అక్కడ భూమి పూజకు ఏర్పాట్లు చేస్తోందని లేఖలో పేర్కొన్నారు.కావేరీ నీటి వివాద ట్రైబ్యునల్ ఇచ్చిన ఆదేశాలను కర్ణాటక ఉల్లంఘిస్తోందని విజయ్ ఆరోపించారు. ఈ ఆదేశాలను గతంలో సుప్రీంకోర్టు కూడా సమర్థించిందని తెలిపారు. ఎగువన ఉన్న రాష్ట్రాలు దిగువ రాష్ట్రాల అనుమతి లేకుండా కొత్తగా ఎలాంటి జలాశయాలు నిర్మించొద్దని పేర్కొన్నారు. తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల అంగీకారం కర్ణాటకకు తప్పనిసరని వివరించారు.ట్రైబ్యునల్ అనుమతించిన ప్రాజెక్టుల జాబితాలో మేకెదాటు లేదని సీఎం విజయ్ పేర్కొన్నారు. కావేరీ బేసిన్‌లో ఇప్పటికే నీటి కొరత ఉందని లేఖలో రాశారు. ఉన్న నీటిని ఇప్పటికే అన్ని రాష్ట్రాలకు కేటాయించారని తెలిపారు. ఇప్పుడు కొత్తగా భారీ జలాశయం నిర్మించడం సుప్రీంకోర్టు తీర్పును ధిక్కరించడమే అవుతుందని హెచ్చరించారు.కాగా, త్వరలోనే విజయ్ ఢిల్లీ వెళ్లి ప్రధానిని కలిసే అవకాశం ఉంది.

# మరిన్ని బయటపెడతా

మొదటి పేజీ రువాయి

వ్యవహారంపై సిట్, సీఐడీ విచారణ జరపాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో హరీష్ రావు మాట్లాడుతూ.. ప్రైవేట్ వ్యక్తికి సదరు భూమి అప్ప జెప్పి.. తప్పు చేసిన ఎమ్మార్వోను బదిలీతో సరిపెట్టారన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి తహసీల్దారును వెంటనే డిస్మిస్ చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ స్కాం వెనుక సీసీఎల్ఏ ఉన్నాడా? కలెక్టర్ ఉన్నాడా? అంటూ హరీష్ రావు సందేహం వ్యక్తం చేశారు.ఈ భూమి ప్రభుత్వానిదని ఆర్డీవో చెబుతున్నారని చెప్పారు. పై అధికారి చెప్పినా వినకుండా.. ఎమ్మార్వో మాత్రం ఇది ప్రైవేట్ భూమి అంటున్నారని హరీష్ రావు వివరించారు. ముఖ్యమంత్రికి సన్నిహితుల నుంచి ఒత్తిడి ఉన్నందునే తహసీల్దారును బదిలీ చేసి కాపాడుతున్నారని ఆరోపించారు. సీఎం సన్నిహితుల ఒత్తిడితోనే.. ఎమ్మార్వోపై చర్యలు తీసుకోకుండా ఏసీబీ అధికారులు వెనక్కి వచ్చారని ఆరోపించారు. సింగరేణిలో రూ.16 వందల కోట్ల విలువైన బొగ్గు మాయమైందని ఆందోళన వ్యక్తం చేశారు.40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు ఎక్కడో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించాలని డిమాండ్ చేశారు. బొగ్గు ఉందో? లేదో? పరిశీలన కోసం అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు స్పష్టం చేశారు. 'కాంగ్రెస్ హఠావో – సింగరేణి బచావో'.. బొగ్గు గని కార్మికుల నినాదం కావాలని హరీష్‌రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ హయాంలో సింగరేణి స్కాంలకు గనిలా మారిందని అభివర్ణించారు.నైనీ బ్లాక్ బొగ్గు గనుల టెండర్.. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని బయట పెట్టిందన్నారు. త్వరలో సింగరేణిపై కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలు మరిన్ని బయటపెడతానని హరీష్‌రావు స్పష్టం చేశారు. అలాగే రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌పై వేసిన సస్పెన్షన్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ శాఖలో వేల కోట్ల రూపాయిల అవినీతి జరుగుతోందంటూ ఈ సందర్భంగా హరీష్ రావు తీవ్ర ఆరోపణలు గుప్పించారు.

# లొంగిపోయిన మావోయిస్టు దంపతులు..

మొదటి పేజీ రువాయి

అందజేశారు. అనంతరం డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 47 మంది మావోయిస్టులు ఇంకా అజ్ఞాతంలో ఉన్నట్లు గుర్తించామన్నారు. అందులో తెలంగాణాకి చెందిన వారు ముగ్గురు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఒకరు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు 15, జార్ఖండ్ 13, ఒడిశాకు చెందిన 15 మంది ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని వివరించారు.2024 నుండి ఇప్పటి వరకు 822 మంది మావోయిస్టులు లొంగిపోయారని పేర్కొన్నారు. మొత్తం 334 ఆయుధాలతో వీరంతా తెలంగాణా పోలీసులు ఎదుట లొంగిపోయారని చెప్పారు. ఇక తెలంగాణా పోలీసులు ముందు లొంగిపోయిన ఒడిశాకి చెందిన మావోయిస్టులను ఆ రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించామని పేర్కొన్నారు. మన రాష్ట్రానికి చెందిన మావోయిస్టులను త్వరలో వారి ప్రాంతాలకు వెళ్లి స్వయంగా కలుస్తానని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు.తెలంగాణాకు చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు ముప్పాళ్ల లక్షణరావు అలియాస్ గణపతితోపాటు జాడే రత్న బాయి అలియాస్ సుజాత, వార్త శేఖర్ అలియాస్ మంగు లొంగిపోవాలని ఈ సందర్భంగా వారికి డీజీపీ సీవీ ఆనంద్ విజ్ఞప్తి చేశారు. మీరు లొంగిపోతే ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని బెనిఫిట్స్‌తోపాటు సదుపాయాలు కల్పిస్తామని అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులకు డీజీపీ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.మే 12వ తేదీన పోలీసుల ఎదుట నరహరి, ఆయన భార్య లొంగిపోయారు. వారిని ఈ రోజు మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. 2026, మార్చి 31వ తేదీ నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం ఆపరేషన్ కగార్ చేపట్టింది. ఈ సందర్భంగా వందల సంఖ్యలో మావోయిస్టులు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. అలాగే పలువురు మావోయిస్టులను అరెస్ట్ చేశారు. మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు నిరంతరాయంగా చేపట్టిన కూంబింగ్ కారణంగా భారీ సంఖ్యలో మావోయిస్టులు మరణించారు. ఇక ప్రభుత్వం ఎదుట లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం ప్రకటించిన రివార్డులు అందజేశారు. దీంతో దేశంలో దాదాపుగా మావోయిస్టు పార్టీ ప్రాబల్యం దాదాపుగా తగ్గిపోయింది.

# పంట అవశేషాలను కాల్చొద్దు

మొదటి పేజీ రువాయి

అందువల్ల పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలియదున్నాలని రైతులకు సూచించారు.

**పంట అవశేషాలను కాల్చితే కఠిన చర్యలు**

రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు అందజేస్తామని మంత్రి వెల్లడించారు. అయినప్పటికీ పంట అవశేషాలను కాల్చితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కూడా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. శాటిలైట్ సాంకేతికత ద్వారా పంట అవశేషాల దహనాన్ని గుర్తిస్తున్నామని తెలిపారు. రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

**యూరియా సరఫరా కేంద్రం పరిధిలోనే**

యూరియా సరఫరా విషయంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని మంత్రి తుమ్మల ఆరోపించారు. యుద్ధ ప్రభావంతో యూరియా సరఫరాలో అంతరాయం ఏర్పడిందని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందే కేంద్రాన్ని పలుమార్లు కోరినా సరఫరా సమస్య కొనసాగుతోందన్నారు. యూరియా సరఫరా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంటుందని చెప్పారు.

**పంటల ఎంపికలో జాగ్రత్త**

రాష్ట్రంపై బీజేపీ చేస్తున్న విమర్శలు అన్యాయమని మంత్రి వ్యాఖ్యానించారు. ఎల్‌నినో ప్రభావంతో సాధారణంగా పడే వర్షాలు తగ్గే అవకాశం ఉందని మంత్రి హెచ్చరించారు. అందువల్ల రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ రైతులకు భరోసా ఇచ్చే పంటగా మారుతోందని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ సాగుతో రైతులు స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉందని చెప్పారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

# సాయుధ పోరాటం కష్టం

మొదటి పేజీ రువాయి

హక్కుల సాధన చట్టపరంగానే జరగాలని భావిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. లొంగిపోయిన మావోయిస్టులకు తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయలు, సాయుధ పోరాటంలో చోటు చేసుకున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రజా జీవితంలోకి రావాలని మావోయిస్టు పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణరావును నరహరి కోరారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డితోపాటు డీజీపీ సీవీ ఆనంద్‌కు పసునూరి నరహరి కృతజ్ఞతలు తెలిపారు. మే 12వ తేదీన తెలంగాణ పోలీసులు ఎదుట మావోయిస్టులు నరహరితోపాటు ధనమ్మ లొంగిపోయారు. వీరిని మంగళవారం మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా వారికి ప్రభుత్వం తరపున వారికి డీజీపీ నగదు చెక్కులను అందజేశారు. అజ్ఞాతంలో ఉన్న 47 మంది మావోయిస్టులు కూడా లొంగి పోవాలని ఈ సందర్భంగా డీజీపీ పిలుపునిచ్చారు.




# కాల్చేసే ఎండ, వడగాలులు

మొదటి పేజీ రువాయి

వడగాల్పులు కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో వీచే అవకాశం ఉన్నందున, ఈ జిల్లాలకు రెడ్ అలర్ట్‌గా ప్రకటించారు. తీవ్రమైన వడగాల్పులు వీచే కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, మహబూబ్ బాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది.

**గంటకు 50 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు**

రేపు అతి తీవ్రమైన వడగాల్పులు పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో వీచే అవకాశం ఉన్నందున రెడ్ అలర్ట్, తీవ్ర వడగాల్పులు వీచే ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది. క్యూములోనింబస్ మేఘాల ప్రభావంతో ఇవాళ మధ్య, దక్షిణ తెలంగాణ జిల్లాలతో పాటు కొన్ని పశ్చిమ, ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. గంటకు 50 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది.

## రాత్రి సమయంలో కూడా మొక్కజొన్న

# అన్‌లోడింగ్ కొనసాగేలా చర్యలు చేపట్టాలి

**ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలి**

**జిల్లా కలెక్టర్ అంకిత్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 26, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** మండలంలోని బంగారు చిలక మొక్కజొన్న నిల్వ గోడౌన్‌తో పాటు ఇల్లందు క్రాస్ రోడ్ వద్ద నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. బంగారు చిలక మొక్కజొన్న గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్, గోడౌన్‌కు చేరుతున్న మొక్కజొన్న లారీల అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గోడౌన్‌లో 2,500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. సుజాతనగర్, కొత్తగూడెం, టేకులపల్లి, ఇల్లందు, చర్ల, సమ్మెట, బూర్గంపాడు, ఆళ్లపల్లి, గుండాల తదితర మండలాల నుంచి మొక్కజొన్న ఇక్కడికి వస్తోందని తెలిపారు. అన్‌లోడింగ్ ప్రక్రియ ఆలస్యం కాకుండా రాత్రివేళల్లో కూడా పనులు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకోసం తగిన లైటింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, అవసరమైతే అదనపు హమాలీలను నియమించాలని సూచించారు. గోడౌన్‌లో మొక్కజొన్న నిల్వల అన్‌లోడింగ్ తీరును, బస్తాలను భద్రపరుస్తున్న విధానాన్ని పరిశీలించిన కలెక్టర్, పూర్తి నిల్వ సామర్థ్యాన్ని వినియోగించుకునేలా పంటను నిల్వ చేయాలని, ఎలాంటి నష్టం కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిల్వ సామర్థ్యాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించుకునేలా మొక్కజొన్న బస్తాలను సాధ్యమైనంత ఎక్కువ ఎత్తులో పేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. హమాలీలతో మాట్లాడిన కలెక్టర్, ఒక్క లారీ అన్‌లోడింగ్‌కు ఎంత సమయం పడుతోంది, ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. హమాలీలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఇల్లందు క్రాస్ రోడ్ వద్ద నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. భవన నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, పూర్తి స్థితిపై సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం మే నెలలో ప్రారంభమైన పనులు ఇప్పటివరకు పూర్తికాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, పనుల ఆలస్యానికి గల కారణాలను వివరంగా నివేదించాలని ఆదేశించారు. పనుల అమలులో జాప్యం చోటుచేసుకున్న కాంట్రాక్టర్లకు మెమోలు జారీ చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్ల వ్యయంతో మహిళా సాధికారతకు వేదికగా ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ ప్లాన్లు, గదుల నిర్మాణం, మౌలిక సదుపాయాల పనులను పరిశీలించిన కలెక్టర్, పనులు ఎప్పటిలోగా పూర్తి అవుతాయో అధికారులను ఆరాతీశారు. పనుల పురోగతిని ప్రతిరోజూ పర్యవేక్షించాలని, నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన సంఖ్యలో కార్మికులను నియమించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భవనంలోని ప్రతి బ్లాక్‌ను అన్ని సౌకర్యాలతో సిద్ధం చేయాలని, స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, ఉత్పత్తుల ప్రదర్శన, మార్కెటింగ్ కార్యకలాపాలకు ఉపయోగపడే విధంగా భవనాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. ఈ పరిశీలనలో తాసిల్దార్ శిరీష, పంచాయతీరాజ్ అధికారి శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సైబర్ నేరాల బాధితులకు సత్వర న్యాయం జరిగేలా

# చర్యలు తీసుకోవాలని ఎస్‌హెచ్‌ఓలకు ఎస్.పి ఆదేశం

**మనీ రిస్టోరేషన్ మేనేజ్‌మెంట్ పోర్టల్ ద్వారా సైబర్ నేరాలలో రూ.50 వేల లోపు డబ్బు కోల్పోయిన బాధితులకు రీఫండ్ అందేలా చర్యలు తీసుకోవాలని సూచన.**

**మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్ కేసులను త్వరితగతిన ఛేదించాలి.**

**సిఎంఎస్ (కోర్టు మానిటరింగ్ సిస్టమ్)లో రోజువారీ కోర్టు కార్యకలాపాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని కోర్టు డ్యూటీ అధికారులకు సూచనలు.**

**నైట్ బీట్, పెట్రోలింగ్ వాహనాల్లో జీపీఎస్ వ్యవస్థ పనితీరును ఎస్‌హెచ్‌ఓ లు నిరంతరం పర్యవేక్షించాలి.**

**ఫంక్షన్ వర్టికల్‌పై పోలీసు అధికారులు, స్టేషన్ రైటర్లు, కోర్టు డ్యూటీ అధికారులు, సైబర్ వారియర్స్‌తో దృశ్య సమీక్ష నిర్వహించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్.**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 26,** సంగారెడ్డి జిల్లా ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఫంక్షన్ వర్టికల్ దృశ్య సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్ జిల్లా పోలీసు అధికారులు, స్టేషన్ రైటర్లు, కోర్టు డ్యూటీ అధికారులు, సైబర్ వారియర్స్ వర్టికల్ విభాగాల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలలో బాధితులకు వేగవంతమైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా సైబర్ నేరాల్లో రూ. 50 వేల లోపు డబ్బు కోల్పోయిన బాధితులకు మనీ రిస్టోరేషన్ మేనేజ్‌మెంట్ పోర్టల్ ద్వారా త్వరితగతిన రీఫండ్ అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిస్సింగ్ కేసు చేదనకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, పెండింగ్ కేసులను త్వరితగతిన ఛేదించాలని ఎస్‌హెచ్‌ఓలకు సూచించారు. కోర్టు డ్యూటీ అధికారులు సిఎంఎస్ (కోర్టు మానిటరింగ్ సిస్టమ్)లో ప్రతిరోజూ కోర్టులో జరిగిన కార్యకలాపాలు, హియరింగ్స్, సమన్లు, సీసీ నంబర్లు తదితర వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ జరిగిన నేరాలను ఛేదించడం కంటే నేరాలు జరగకుండా నియంత్రించడం కీలకం ముఖ్యమని అన్నారు. జిల్లాలో రాత్రి వేళల్లో నిర్వహిస్తున్న నైట్ బీట్, పెట్రోలింగ్ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించాలని, పెట్రోలింగ్ వాహనాల్లో ఏర్పాటు చేసిన జీపీఎస్ వ్యవస్థ సక్రమంగా పనిచేస్తుందో లేదో ఎస్‌హెచ్‌వోలు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. దొంగతనాల నియంత్రణలో బీట్ అధికారులు, పెట్రో కార్లు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. స్టేషన్ రైటర్లు, సైబర్ వారియర్స్ ప్రతి డేటాను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, వివిధ కేసుల్లో నిర్దేశిత కాలవ్యవధిలో చార్జిషీట్లు దాఖలు చేసేలా ఎస్‌హెచ్‌ఓలకు సహాయకారిగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, డి4సి డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రవి, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజు, సైబర్ సెల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# చేవేళ్ల డిక్లరేషన్ అమలు చేయకుంటే 'నంగారాభేరి' తప్పదు

**కాంగ్రెస్ ప్రభుత్వంపై గర్జించిన లంబాడి హక్కుల పోరాట సమితి కొత్తూరు మండల ప్రధాన కార్యదర్శి, బిచ్య నాయక్**




**హైదరాబాద్ పల్స్, మే 26, షాద్నగర్ :** కాంగ్రెస్ ప్రభుత్వం లంబాడీలను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే వాడుకుంటుందని లంబాడి హక్కుల పోరాట సమితి కొత్తూరు మండలం ప్రధాన కార్యదర్శి బిచ్య నాయక్ అన్నారు. లంబాడీల హక్కుల సాధనకై హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వేదికగా నిర్వహించిన "గిరిజన మహా ధర్నా"కు షాద్ నగర్ నియోజకవర్గం నుండి గిరిజన నాయకులు భారీ ఎత్తున తరలి వెళ్లారు. కొత్తూరు మండలం ప్రధాన కార్యదర్శి బిచ్య నాయక్ ఆధ్వర్యంలో బయలుదేరిన లంబాడీలు, అంతకుముందు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా వైపు కదంతొక్కారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి బిచ్య నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం ఏర్పాటై 30 నెలలు గడుస్తున్నా ఎన్నికల ముందు గిరిజనులకు ఇచ్చిన "చెవెళ్ల డిక్లరేషన్" హామీలను అమలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. లంబాడి వర్గానికి రాష్ట్ర క్యాబినెట్‌లో తక్షణమే తగిన చోటు కల్పించాలని, అలాగే గిరిజన తండాలను పూర్తిస్థాయి రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా ప్రకటించాలని వారు తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. ఈ మహా ధర్నాతోనైనా కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో తండ తండాలు ఏకం అయ్యి ప్రతి జిల్లా కేంద్రంలో "నంగారాభేరి" మోగిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో కోడిచర్ల తండా మాజీ సర్పంచ్ సంతోష్ నాయక్, భాస్కర్ నాయక్, మోహన్ నాయక్, జ్యోతి నాయక్, దేవు నాయక్, మోహన్ నాయక్, హర్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కూతురిపై పలుమార్లు అత్యాచారం..

# కన్నతండ్రికి 20 ఏళ్ల జైలు శిక్ష విధించిన కోర్టు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 26, మెయిన్ డెస్క్ :** రంగారెడ్డి జిల్లా కోర్టు ఓ లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ సంచలన తీర్పునిచ్చింది. భవిష్యత్తు నగరం (ఫ్యూచర్ సిటీ) పోలీస్ కమీషనరేట్ పరిధిలోని షాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో ఈ తీర్పు వెలువడింది. జైలు శిక్షతో పాటు బాధితురాలికి రూ.7 లక్షల నష్టపరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. షాబాద్ మండలం కుర్వగూడ గ్రామానికి చెందిన 37 ఏళ్ల ఓ కూలీ.. తన సొంత కుమార్తెపైనే పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు రుజువైంది. దీనితో భారతీయ న్యాయ సంహిత, బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టం-2012 లోని నిబంధనల ప్రకారం కోర్టు అతడిని దోషిగా నిర్ధారించింది. పోలీసుల కథనం ప్రకారం.. సదరు బాలికపై ఆమె తండ్రి నివాసంలోనే పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు 2024 అక్టోబర్ 12న ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదు ఆధారంగా షాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు విచారణలో భాగంగా పోలీసులు బాధితురాలి నుండి, సాక్షుల నుండి కీలక సమాచారాన్ని సేకరించారు. మౌఖిక, డాక్యుమెంటరీ, శాస్త్రీయ (సైంటిఫిక్) ఆధారాలను పకడ్బందీగా సేకరించి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. పూర్తి విచారణ, వాదనల అనంతరం, ఎల్బీనగర్‌లోని పోక్సో కేసుల ప్రత్యేక సెషన్స్ జడ్జి నిందితుడిని దోషిగా తేల్చారు. అతనికి 20 ఏళ్ల కఠిన జైలు శిక్షతో పాటు రూ. 2,500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.



## మంత్రి కోమటిరెడ్డిని కలిసిన సర్పంచ్ భూక్య సంతోష్ నాయక్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి:** మంగళవారం హైదరాబాదులో రాష్ట్ర సెక్రటేరియట్, అంబేద్కర్ భవన్ లో తెలంగాణ రోడ్లు ఌ భవనాలు (ఆర్‌డబి), సినిమాటోగ్రఫీ శాఖల మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డిని జైతిరం తండా గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్య సంతోష్ నాయక్ కలవడం జరిగింది, ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామంలో డ్రైనేజీ, మరియు సిసి రోడ్డు నిర్మాణానికి మరియు గ్రామ పంచాయతీలోని మామిడికుంట తండా గతంలో కాలేశ్వరం ప్రాజెక్టు కింద రియాబిటేషన్ లో భాగంగా ఇల్లు కోల్పోవడం జరిగింది, వారికి ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కొరకు నిధులు కేటాయించాలని, గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు, దానికి మంత్రివర్యులు తప్పకుండా సహకరిస్తానని, రాష్ట్రంలోని గ్రామాల అభివృద్ధికి తప్పకుండా అభివృద్ధి చేస్తామని తెలియజేశారు.

# బెల్లి లలితక్క 27వ వర్ధంతి

**బెల్లి లలితక్క విగ్రహ నిర్మాణ**

**భూమి పూజలో పాల్గొన్న ఇంజ మహేష్ మాదిగ**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** మలిదశ తెలంగాణ ఉద్యమ నాయకురాలు, తెలంగాణ కళా సమితి రాష్ట్ర కో కన్వీనర్, తెలంగాణ గాన కోకిల అమరురాలు బెల్లి లలితక్క 27 వ వర్ధంతి యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఎంఈఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఇంజా మహేష్ మాదిగ, పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం బెల్లి లలిత అక్క విగ్రహ నిర్మాణ భూమి పూజలో పాల్గొని. మాట్లాడుతూ. భారతీయ జానపద గాయని, సామాజిక కార్యకర్త మరియు, 1990 ల చివరిలో తెలంగాణ ఉద్యమ నిర్మాణ గలం, తెలంగాణ గాన కోకిలగా పిలవబడే ఆమె, తెలంగాణ కళా సమితిని సహ స్థాపించారు. ఉపాధి లేని కార్మికులు, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం, మరియు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆమె తన జీవితాన్ని అంకితం చేశారు అని అన్నారు. బెల్లి లలిత అక్క విగ్రహ కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు బట్టు రామచంద్రయ్య, లలితక్క కుమారుడు సూర్య ప్రకాష్, జన్ని, వెన్నెల జర్నలిస్టులు, జాన్, బుగ్గ శ్రీనివాస్, లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు భాస్కర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల కుటుంబాలకు బియ్యం అందించిన ఉప సర్పంచ్ బద్ధం మధుసూదన్ రెడ్డి



**హైదరాబాద్ పల్స్ న్యూస్,మే26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం బేగంపేట గ్రామంలో ఇటీవల మరణించిన నిరుపేదలకు సంబంధించిన రెండు కుటుంబాల వృద్ధురాళ్ళు నాగారం పెద్ది రాజమ్మ, కొమ్ము బాలమ్మ, వృద్యాప్యంతో మరణించగా గ్రామ ఉప సర్పంచ్ బద్ధం మధుసూదన్ రెడ్డి ఆయా కుటుంబాలను పరామర్శించి, ఆర్థిక సాయంగా ఒక్కొక్కరికి 50 కిలోల బియ్యం ఉచితంగా అందజేశారు. ఈ ఆర్థిక సహాయ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు, దేవి సుధాకర్, నాగారం రామచంద్రం, భోగ హరినాథ్, జిట్ట ఉదయ్ కిరణ్ రెడ్డి, జిట్ట సత్యవర్ రెడ్డి, దేవనపల్లి రాజు, చిందిగారి కృష్ణ, తోట సత్తయ్య, వాకిటి రామచంద్రం, ఉగ్గ కరుణాకర్ పాల్గొన్నారు,

# కళ్ళకు గంతలతో వివోఏ ల వినూత్న నిరసన....

**తొమ్మిదవ రోజుకు చేరుకున్న వివోఏ ల దీక్ష....**



**హైదరాబాద్ పల్స్ న్యూస్,మే 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి:** ఆత్మకూరు (ఎం) మండలం, వివోలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రధాన డిమాండ్ తో కొనసాగుతున్న వివోఏ ల సమ్మె 9 రోజుకు చేరుకుంది. మండల సమాఖ్య కార్యాలయం ఎదుట మంగళవారం 9వ రోజు దీక్షలో వివోఏలు కళ్ళకు గంతలు కట్టుకుని వినూత్న రీతిలో నిరసన దీక్ష కు కూర్చున్నారు. ప్రభుత్వం, అధికారులు తక్షణమే మా న్యాయమైన డిమాండ్స్ ను అమలు చేయాలని వివోఏ లకు ఉద్యోగ భద్రత కల్పించి వేతనం ఇరవై వేలు చేయాలని అర్హత గల వారికి సీసీ లుగా ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. ఈ దీక్షల్లో వివోఏ జేఏసి జిల్లా అధ్యక్షురాలు ఎం.శిరీష, నాయకులు తవిటి స్వప్న, నాగభూషణం, తుమ్మల సరిత, పులుసాని సునీతా, ఉప్పల విజయ, కాన్ రాజు నాగరాణి, వేముల నర్సింహ్మా, వేములకొండ శ్రీనివాస్, కాసాని ధనమ్మ, పోలేపాక భాగ్యమ్మ, బూడిద సుచరిత, మర్రిపల్లి ప్రమీల, గొర్రెంకాల నిర్మల, పాశం శ్యామల,కే మౌనిక, పి.వనిత, ఎం విజయలక్ష్మి, యాస మహేశ్వరి లు పాల్గొన్నారు

# బాధిత కుటుంబానికి అండగా నిలిచిన జీ.ఎం.ఆర్ ఫౌండేషన్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 26, నారాయణ ఖేడ్ :**
మనూరు మండలం ఉసిరిక పల్లి గ్రామానికి చెందిన కాసిం సాబ్ అనారోగ్య సమస్యతో మృతిచెందిన విషయం తెలుసుకున్న వెంటనే జీఎంర్ ఫౌండేషన్ చైర్మన్, బి ఆర్ యస్ పార్టీ నాయకులు గుబ్బప మచ్చేందర్ స్పందించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గుబ్బప మచ్చేందర్ ఆదేశాల మేరకు జీఎంర్ ఫౌండేషన్ ద్వారా అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందించి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. ఈ సహాయం పట్ల గ్రామ ప్రజలు మరియు కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ జీఎంర్ ఫౌండేషన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ బి ఆర్ యస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి మారుతి పటేల్, మనూరు మండల్ బి ఆర్ యస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ వెంకట్రావు బందేల్లి, యువ నాయకులు పవన్ ,కలీల్, యూసుఫ్, మైబు, మైన్ సాబ్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ పార్టీ పెట్రోల్, డీజిల్ రేట్ల పెంపు పై బి.ఆర్.ఎస్. నాయకుడు వీరారెడ్డి నరేందర్ రెడ్డి ఫైర్



**కుత్బుల్లాపూర్, మే 26, హైదరాబాద్ పల్స్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం బీజేపీ నాలుగోసారి పెట్రోల్, డీజిల్ ధరల పెంపు ప్రజలపై మరింత భారం మోపుతుంది దేశవ్యాప్తంగా ఇప్పటికే పెరిగిన నిత్యావసర ధరలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో, బీజేపీ కేంద్ర ప్రభుత్వం మరోసారి పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం దారుణమని బీఆర్ఎస్ సీనియర్ లీడర్ వీరారెడ్డి నరేందర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. కేవలం ఆరు రోజుల వ్యవధిలోనే మరోసారి పెట్రోల్‌పై ?2.61, డీజిల్‌పై ?2.71 పెంపు విధించడం ప్రజలపై ఆర్థిక భారం మోపే చర్య అని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే పెరిగిన ధరలతో ఇబ్బందులు పడుతున్న రైతులు, కార్మికులు, మధ్యతరగతి కుటుంబాలు మరియు పేద ప్రజలపై ఈ నిర్ణయం మరింత భారంగా మారిందన్నారు. డీజిల్ ధరల పెరుగుదలతో రవాణా ఛార్జీలు పెరిగి, నిత్యావసర సరుకుల ధరలు మళ్లీ ఆకాశాన్ని అంటుతాయని, దీని ప్రభావం ప్రతి కుటుంబంపై పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థల లాభాల కోసం సామాన్య ప్రజల జేబులు ఖాళీ చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రజల సమస్యలను పట్టించుకోని బీజేపీ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్పే సమయం వచ్చిందని ఆయన అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ ఖండించాలని, ప్రజలపై భారమేస్తున్న నిర్ణయాలకు గట్టిగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ప్రజల కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతుంది అని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అన్నారు.

# చేతికి తాకే ఎత్తులో విద్యుత్తు వైర్లు.....

**అధికారులు పట్టించుకోవడం లేదని రైతుల ఆరోపణ....**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ప్రాణాపాయ స్థితిలో విద్యుత్తు వైర్లు ఉన్నాయని, పొలంలో పనులు చేసేందుకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తుందని విద్యుత్తు అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ పట్టించుకోవడంలేదని రాజపేట మండలం బేగంపేట గ్రామానికి చెందిన లేగల యాదగిరి, లేగల లాలయ్య లు ఆగ్రహం వ్యక్తం చేసారు. మంగళవారం రోజు ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. తమ బాధలను ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ వ్యవసాయ క్షేత్రంలో పనులు చేసుకునేందుకు సేద్యం చేసుకునేందుకు ప్రమాదకరంగా 11 కెవి విద్యుత్తు లైను చేతులకు అందెంత ఎత్తులో ఉన్నాయని పలుమార్లు ఇబ్బందులు ఎదుర్కొని ప్రాణాపాయం నుంచి బయటపడినట్లు తెలిపారు. ఈ విషయాన్ని సంబంధిత విద్యుత్తు ఎఈ, బేగంపేట విద్యుత్తు అధికారులకు తెలియజేసిన ఫలితం లేకుండా పోయిందన్నారు. స్థానిక సర్పంచ్ ద్వారా కూడా పై విషయాల్ని తమ బాధను తెలిపినట్లు రైతులు చెప్పారు. రైతుల ప్రాణాలకు ఇబ్బందులు కలగకముందే విద్యుత్తు అధికారులు వెంటనే స్పందించి రెండు విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు

## ముఖ్యమంత్రి పర్యటనకు

# కొలం కొరారి సన్నద్ధం

**కలెక్టర్ హరిత క్షేత్రస్థాయి పరిశీలన**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 26, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి మండలం కొలం కొరారి గ్రామానికి జూన్ 1 వ తేదీ రోజున ముఖ్యమంత్రి రానున్న నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ కె. హరిత మంగళవారం స్వయంగా గ్రామాన్ని సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. దాస్, ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వర్ రావు, ఇంజనీరింగ్ మరియు ఇతర శాఖల ఉన్నతాధికారులు ఈ పరిశీలనలో పాల్గొన్నారు. హెలిప్యాడ్ పనులు వెంటనే పూర్తి చేయాలని, గ్రామంలో అంతర్గత రహదారులు, మురికి కాలువల పూడికతీత పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పాత నిర్మాణాలు, చెత్తాచెదారాన్ని తొలగించాలని, ఇందిరమ్మ ఇళ్లను అలంకరించి లబ్ధిదారులకు అందజేసేందుకు సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి లబ్ధిదారులతో నేరుగా మాట్లాడే అవకాశం ఉన్నందున ప్రత్యేక వేదిక నిర్మించాలని, సభకు వచ్చే ప్రజలకు తాగునీరు, షామియానాలు, కుర్చీల సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, పీడీ ప్రకాష్ రాజు సహా పలువురు జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బాబా జగ్జీవన్ రామ్ రీడింగ్ రూమ్‌పై అనవసర డిమాండ్లను ఖండిస్తున్నాం

**టీఎస్ ఎంఆర్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి శనిగరపు మల్లేష్.**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 26, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని డాక్టర్ బాబా జగ్జీవన్ రామ్ రీడింగ్ రూమ్ విషయంలో రేగుంట కేశవరావు చేస్తున్న వ్యాఖ్యలు, డిమాండ్లు పూర్తిగా అనుచితమని టీఎస్ ఎంఆర్పీఎస్ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నాం. ఎమ్మెల్యే కోవలక్ష్మి మేడం ఆధ్వర్యంలో విద్యార్థులు, యువత చదువులో ముందుకు వెళ్లాలని లక్ష్యంతో ఈ రీడింగ్ రూమ్ నిర్మించబడింది. ఇది చదువుకునే విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రజా ఉపయోగ భవనం. అలాంటి రీడింగ్ రూమ్‌ను వృద్ధులు, వితంతువుల సమావేశాలు లేదా ప్రెస్‌మీట్‌ల కోసం మాకు అప్పగించాలంటూ కోరడం ఎంతవరకు సమంజసం అనే విషయాన్ని ప్రజలే ఆలోచించాలి. వృద్ధులు, వితంతువుల సమస్యలు నిజంగా ప్రజా సమస్యలైతే వాటిపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, అధికారులను కలవడం, ప్రజా వేదికలపై మాట్లాడడం స్వాగతించదగిన విషయం. కానీ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన రీడింగ్ రూమ్‌ను తమ ఆధీనంలోకి ఇవ్వాలని కోరడం సరైన విధానం కాదు అని అన్నారు. గత 30 సంవత్సరాలుగా ఆసిఫాబాద్ జిల్లాలో ప్రజా సమస్యలపై మాట్లాడుతున్నామని చెప్పుకునే నాయకులు ప్రజలకు ఉపయోగపడే అంశాలపై దృష్టి పెట్టాలి గానీ, సమాజానికి ఉపయోగపడుతున్న భవనాలపై వివాదాలు సృష్టించడం మానుకోవాలి అంటూ విమర్శించారు. ఈ రీడింగ్ రూమ్ ఏ ఒక్కరి సొత్తు కాదు. ఇది ప్రజలందరికీ సంబంధించిన సామాజిక ఆస్తి. దీనిని రాజకీయ లేదా వ్యక్తిగత ఆధిపత్య వేదికగా మార్చే ప్రయత్నాలను టీఎస్ ఎంఆర్పీఎస్ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదు. అని టి ఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి శనిగారపు మల్లేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు

# టీపీసీసీ ఎస్సీ సెల్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా చైర్మన్ గా కావలి చంద్రయ్య (చెన్నయ్య)



**కుత్బుల్లాపూర్, మే 26, హైదరాబాద్ పల్స్ న్యూస్ :** కుత్బుల్లాపూర్ జగత్గిరిగుట్ట కు చెందిన కావాలి చెంద్రయ్య మేడ్చల్ మల్కాజ్గిరి టీపీసీసీ చైర్మన్ గా నియమితులయ్యారు. తనకు బాధ్యతలు అప్పగించిన ఎస్సీ సెల్ చైర్మన్ మానకొండూరు ఎమ్మెల్యే తెలంగాణ రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఈసందర్భంగా ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్‌గా నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలను అప్పగించిన ఏఐసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ రాజేందర్ పాల్ గౌతమ్, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ, టీపీసీసీ ఎస్సీ సెల్ నాగరిగారి ప్రీతంకు హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ నియామక ఆర్డర్స్‌ను గౌరవంగా స్వీకరించడం నాకు ఎంతో గర్వకారణం. సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, పార్టీ బలోపేతం కోసం, ఎస్సీ సమాజ హక్కుల సాధన కోసం కట్టుబడి పనిచేస్తాను మన హక్కులకై నిరంతరం పోరాటం చేస్తా నాపై విశ్వాసం ఉంచిన ప్రతి నాయకుడికి, కార్యకర్తలకు, అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని అన్నారు.

# సింహాద్రి అప్పన్న స్వామి వారిని కుటుంబ సభ్యులతో దర్శించుకున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంలో ప్రసిద్ధి చెందిన సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య - శ్రీమతి బీర్ల అనిత తమ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 25వ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సింహాద్రి అప్పన్నగా ప్రసిద్ధి చెందిన శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో దంపతులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక దర్శనం చేసుకుని, స్వామివారికి ప్రత్యేక పూజలు సమర్పించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేసి, స్వామివారి తీర్థ ప్రసాదాలను బీర్ల ఐలయ్యకి అందించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మరియు అర్చకులు సింహాచలం దేవస్థానం చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను వారికి వివరించారు. స్వామివారి కృపతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని బీర్ల ఐలయ్య - అనిత దంపతులు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జిల్లా, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. భక్తులతో కలిసి స్వామివారి దర్శనం చేసుకోవడం ఆనందంగా ఉందని, ఆధ్యాత్మిక క్షేత్రాల సందర్శన ద్వారా మరింత సేవాభావంతో ప్రజలకు అందుబాటులో ఉంటామని బీర్ల ఐలయ్య తెలిపారు.

# బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 26, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా లో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా వారోత్సవాల సందర్భంగా సోమవారం సిర్పూర్ మండలంలోని బెస్తవాడ అంగన్‌వాడీ కేంద్రంలో బాల్యవివాహాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలకు 18 ఏళ్లు, బాలురకు 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలని సూచించారు. బాల్యవివాహాల వల్ల శారీరక, మానసిక ఎదుగుదల దెబ్బతినడంతో పాటు చదువు మధ్యలో ఆగిపోతుందని వివరించారు. వివాహాలు జరిపే ముందు వయస్సు నిర్ధారణ చేయాలని పూజారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు, కిశోర బాలికలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ కలిసిన మాద్రి పృథ్వీరాజ్



**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 26 :** బిఆర్ఎస్ పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా పటాన్‌చెరు నియోజకవర్గానికి సభ్యత్వ ఇన్‌చార్జ్‌గా రాష్ట్ర కమిటీ నియమించిన మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఎండీర్ ఫౌండేషన్ కో-ఫౌండర్, బీఆర్ఎస్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్ మంగళవారం నాడు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ అభివృద్ధి కోసం క్షేత్రస్థాయిలో తాము కూడా సమర్థవంతంగా పనిచేస్తామని శ్రీనివాస్ కి తెలిపారు. పటాన్‌చెరు మరియు జేపీ కాలనీ జిహెచ్ఎంసి పరిధిలోని కాలనీల్లో స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మరియు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డితో కలిసి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నిరంతరం కృషి చేస్తానని పృథ్వీరాజ్ పేర్కొన్నారు. భవిష్యత్తులో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో మరింత బలోపేతం అవుతూ విజయకేతనం ఎగురవేస్తుందని, పార్టీ శ్రేణులంతా ఐక్యంగా కలిసి పనిచేయాలని ఆయన కోరారు

## కొనుగోలు కేంద్రంలో హమాలీకి తేలుకాటు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం లక్ష్మక్కపల్లి ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రంలో పనిచేస్తున్న హమాలి తేలుకాటుకు గురయ్యారు ఈ విషయం తెలిసిన వెంటనే రేణికుంట పిఎసిఎస్ సీఈవో సిల్వేరు శేఖర్ చికిత్స నిమిత్తం హుటాహుటిన ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతానికి హమాలి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిసిందని తెలిపారు

## వేం నరేందర్ రెడ్డితో భద్రాచలం కాంగ్రెస్ నాయకుల భేటీ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 26, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** హైదరాబాద్‌లో ముమ్మర రాజకీయ సందడి వేం నరేందర్ రెడ్డితో భద్రాచలం కాంగ్రెస్ నాయకుల భేటీ తెలంగాణ ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు మరియు రాజ్యసభ సభ్యులు (ఎంపీ) వేం నరేందర్ రెడ్డిని హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలానికి చెందిన ప్రముఖ కాంగ్రెస్ నాయకులు భోగాల శ్రీనివాస్ రెడ్డితో పాటు మరికొందరు ముఖ్య నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు వేం నరేందర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాకు సంబంధించిన పలు రాజకీయ, స్థానిక అభివృద్ధి అంశాలు ఈ భేటీలో చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది.

విలేకరులు కావలెను
హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక
"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్
- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413
www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad

# జనభాగీదారి అభియాన్‌తో గిరిజన గ్రామాల్లో చైతన్యం

### సమస్యల గుర్తింపుతో తదుపరి చర్యలకు సుమార్గం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 26, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఈ నెల 18 నుంచి 25 వరకు నిర్వహించిన జనభాగీదారి అభియాన్ కార్యక్రమం గిరిజన ప్రాంతాల్లో అవగాహన, ఆరోగ్యం, సంక్షేమ సేవల విస్తరణకు కీలకంగా మారింది. కేంద్ర ప్రభుత్వం గిరిజనుల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం విస్తృతంగా అమలు చేసింది. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జన్మన్, జుగా పథకాల కింద గుర్తించిన 241 గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మొత్తం 341 గ్రామసభలు, 241 అవగాహన ర్యాలీలు చేపట్టి గిరిజన గూడాల్లో ప్రభుత్వ పథకాలపై చైతన్యం కల్పించారు. గ్రామస్థులకు సంక్షేమ పథకాల వినియోగం, హక్కులు, అభివృద్ధి అవకాశాలపై వివరించారు. ఆరోగ్య పరంగా 168 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సికిల్ సెల్, క్షయవ్యాధి, మధుమేహం వంటి వ్యాధులపై స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య సేవలు అందించారు. గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించడంలో ఇది ఉపయోగపడింది. అదేవిధంగా 1080 మందికి జాబ్ కార్డులు, ఆధార్ సేవలు అందించారు. రేషన్ కార్డులు, ఆధార్ నవీకరణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల వినియోగంపై ప్రత్యేక సమీక్ష చేపట్టారు. ఐఈసీ ప్రచారాలు, ట్రాన్సెక్ట్ వాక్‌లు, జనసున్వాయి కార్యక్రమాల ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే ప్రయత్నం జరిగింది. అయితే ఈ కార్యక్రమంలో బయటపడిన ప్రధాన అంశం గిరిజన పిల్లలకు జనన ధృవీకరణ పత్రాల లేమి. అనేక గ్రామాల్లో పిల్లలకు జనన నమోదు లేకపోవడం వల్ల విద్య, ఆరోగ్యం, సంక్షేమ పథకాల లబ్ధిలో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు గుర్తించారు. దీనిపై తక్షణ చర్యలకు అధికారులకు సూచనలు జారీ అయ్యాయి. ఈ అభియాన్ గిరిజన గ్రామాల్లో కేవలం అవగాహనకే పరిమితం కాకుండా, ఆరోగ్యం, పత్రాల సదుపాయం, సంక్షేమ సేవలు, ప్రాథమిక సమస్యల గుర్తింపులో కీలకంగా నిలిచింది. పూర్తి నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనునారు.

# డోర్నకల్ రాజకీయాల్లో ఎమ్మెల్యే రామచంద్ర నాయక్‌కు పెరుగుతున్న ప్రజాదరణ


### డోర్నకల్ పట్టణ కాంగ్రెస్ నేత శీలం శ్రీనివాస్



**హైదరాబాద్ పల్స్, మే 26, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** డోర్నకల్ నియోజకవర్గ రాజకీయ సమీకరణాలు ప్రస్తుతం ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్ చుట్టూ కేంద్రీకృతమవుతున్నాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శీలం శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. నియోజకవర్గంలో జరిగిన వివిధ స్థాయి అభిప్రాయ సేకరణలు, ప్రజాభిప్రాయ పరిశీలనలు అంతర్గత విశ్లేషణల ప్రకారం ఆయనకు గణనీయమైన ప్రజా మద్దతు కొనసాగుతోందని తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో శీలం శ్రీనివాస్ మాట్లాడుతూ, డోర్నకల్ ప్రాంతంలో ప్రజలతో ప్రత్యక్ష సంబంధం కలిగి వారి సమస్యలను దగ్గరగా తెలుసుకుంటూ పరిష్కార దిశగా కృషి చేస్తున్న నాయకుడిగా డాక్టర్ రామచంద్ర నాయక్ ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుండి పట్టణాల వరకు ఆయనపై ఉన్న విశ్వాసం స్థిరంగా పెరుగుతోందని అభిప్రాయపడ్డారు. ప్రజల అవసరాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు, సంక్షేమ పథకాల సమర్థ నిర్వహణ వంటి అంశాల్లో ఆయన చురుకైన పాత్ర పోషిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కారణంగానే నియోజకవర్గంలో రాజకీయంగా ఆయన స్థానం మరింత బలపడుతోందని పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో సోషల్ మీడియాలో కూడా ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్‌కు మద్దతు వ్యక్తమవుతోందని, ఆయన తిరిగి ఎమ్మెల్యేగా కొనసాగాలన్న అభిప్రాయం విస్తృతంగా వినిపిస్తున్నట్లు శీలం శ్రీనివాస్ చెప్పారు. ప్రజల్లో కనిపిస్తున్న ఈ మద్దతు స్థానిక రాజకీయ వాతావరణంపై ప్రభావం చూపుతోందని ఆయన అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి రెడ్యా నాయక్ లేదా సత్యవతి రాథోడ్ వంటి ప్రముఖ నేతలు పోటీకి వచ్చినా, నియోజకవర్గ ప్రజల్లో ఎక్కువ భాగం డాక్టర్ రామచంద్ర నాయక్ వైపే మొగ్గు చూపుతున్నారని ఆయన చెప్పారు అభివృద్ధి, సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాల్లో ఆయన చూపిన నిరంతర శ్రద్ధే ఈ మద్దతుకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. డోర్నకల్ నియోజకవర్గ భవిష్యత్ రాజకీయ దిశలో డాక్టర్ రామచంద్ర నాయక్ పాత్ర మరింత కీలకంగా మారుతుందని కాంగ్రెస్ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# మృతుడి కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుల పరామర్శ, ఆర్థిక సహాయం అందజేత

### "కష్టకాలంలో మానవత్వమే పెద్ద బలం" - బోయినపల్లి నాగేశ్వరరావు



**హైదరాబాద్ పల్స్, మే 26, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం వెన్నారం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పెరుగు పుల్లయ్య కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. గ్రామ మాజీ ఉపసర్పంచ్, బోయినపల్లి నాగేశ్వరరావు మంగళవారం బాధిత కుటుంబ నివాసానికి వెళ్లి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ పెద్దను కోల్పోయి తీవ్ర దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చి ధైర్యం చెప్పారు. జరిగిన నష్టం భర్తీ చేయలేనిదని, అయినప్పటికీ ఇలాంటి సమయంలో గ్రామ సమాజం అంతా ఒక్కటిగా నిలవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. కష్టసమయాల్లో రాజకీయాలకు అతీతంగా మానవత్వంతో ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. బాధిత కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను గుర్తించి తన వ్యక్తిగత సహాయంగా రూ.5,000 నగదును అందజేశారు. ఈ చిన్న సహాయం అయినా కుటుంబానికి కొంత ఉపశమనం కలిగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలు కూడా స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలవాలని ఆయన కోరారు. గ్రామంలో సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే బోయినపల్లి నాగేశ్వరరావు చర్యలను స్థానికులు ప్రశంసించారు. కష్టకాలంలో ప్రజలకు అండగా నిలుస్తున్న ఆయన మానవతా భావాన్ని గ్రామస్తులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మధర్, లింగయ్య, కాడెం బిచ్చం, తాళ్లూరి వెంకటేశ్వర్లు, బోయినపల్లి ఉపేందర్, బత్తిని నాగయ్య, దొడ్డ సత్యం, గునిగంటి రాములు, బత్తిని అంజయ్య, బోయినపల్లి బిచ్చం, కళ్లెం అంజయ్య తదితరులు పాల్గొని మృతుడి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు

# 'మేము వెళ్లగొట్టకముందే పారిపోండి'..

## అక్రమ వలసదారులకు బెంగాల్ సీఎం సువేందు తీవ్ర హెచ్చరిక!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 26, సెంట్రల్ బ్యూరో:** పశ్చిమ బెంగాల్‌లో అక్రమ వలసదారులపై కొత్తగా ఏర్పాటైన బీజేపీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి సువేందు అధికారి అక్రమ చొరబాటుదారులకు అత్యంత తీవ్రమైన హెచ్చరికలు జారీ చేశారు. 'ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకముందే.. మీ అంతట మీరే ఇక్కడి నుంచి పారిపోండి' అంటూ ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న విదేశీయుల చట్టం లోబడే తాము ఈ చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో ఎలాంటి కొత్త చట్టం లేదని ఆయన పేర్కొన్నారు.

**ఈ చొరబాటుదారులు ఏమైనా మన అల్లుళ్లా**

ఈ అంశంపై ముఖ్యమంత్రి సువేందు అధికారి మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. 'తమ పౌరులను తిరిగి చేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నామని బంగ్లాదేశ్ ఇప్పటికే ప్రకటించింది. కాబట్టి ఇక్కడున్న అక్రమ వలసదారులు తక్షణమే ఈ ప్రాంతాన్ని విడిచి వెళ్లాలి. అక్రమంగా వచ్చిన వారిని జైళ్లలో పెట్టి బంధించవద్దని నేను పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాను. వారిని జైల్లో ఉంచి భారతదేశ వనరులను, ప్రజల సొమ్మును ఎందుకు వృధా చేయాలి? ఈ చొరబాటుదారులు ఏమైనా మనకు అల్లుళ్లా?' అని సీఎం ఘాటుగా ప్రశ్నించారు.

**సరిహద్దుల్లో మొదలైన వలసదారుల కదలికలు**

ఎవరైనా స్వచ్ఛందంగా వెళ్లకుంటే, ప్రభుత్వం తదుపరి తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వం చర్యలను ముమ్మరం చేయడంతో వలసదారుల్లో వణుకు మొదలైంది. ఉత్తర 24 పరగణాస్ జిల్లాలోని హకీంపూర్ సరిహద్దు ప్రాంతంలో మంగళవారం ఉదయం భారీగా అక్రమ వలసదారులు గుమిగూడారు. ప్రభుత్వం తనిఖీలను తీవ్రతరం చేయడంతో, వారంతా తిరిగి బంగ్లాదేశ్ వెళ్ళిపోవడానికి అక్కడకు చేరుకున్నట్లు తెలుస్తోంది. గతంలో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియ సమయంలోనూ ఇలాంటి దృశ్యాలే కనిపించాయి.

## గొల్లచర్లలో ఇటుక బట్టీ

# అక్రమాలపై తీవ్ర ఆరోపణలు

**భూగర్భ జలాలు ప్రమాదంలో పడుతున్నాయన్న ఆందోళన - బీఎస్పీ తీవ్ర విమర్శలు**

**హైదరాబాద్ పల్స్, మే 26, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** డోర్నకల్ మండలం గొల్లచర్ల గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమ ఇటుక బట్టీల వ్యవహారం దీర్ఘకాలంగా కొనసాగుతోందని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎడ్ల శ్రీను తీవ్ర ఆరోపణలు చేశారు. గ్రామ శివారులో అనుమతులు లేకుండానే చెరువులు, కుంటలు, వ్యవసాయ భూముల నుంచి మట్టిని భారీగా తవ్వుతూ ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ అక్రమ తవ్వకాల కారణంగా భూగర్భ జలాలు వేగంగా తగ్గిపోతున్నాయని, గ్రామంలో నీటి సమస్య తీవ్రమవుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**ఏడేళ్లుగా కొనసాగుతున్న దోపిడీ" - స్థానికుల ఆవేదన**

గత 7--8 సంవత్సరాలుగా ఈ అక్రమ తవ్వకాలు కొనసాగుతున్నాయని, దాని ప్రభావంతో బోర్లు ఎండిపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. వేసవి కాలంలో తాగునీటికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణపై ప్రభుత్వ ప్రకటనలు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం భూగర్భ విధ్వంసం జరుగుతోందని బీఎస్పీ నేతలు ఆరోపించారు.

**ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టం - కాలుష్య ప్రభావం**

అక్రమ ఇటుక బట్టీల నిర్వాహకులు పంచాయతీ, రెవెన్యూ శాఖలకు చెల్లించాల్సిన ఫీజులు ఎగ్గొట్టడంతో ప్రభుత్వానికి కోట్ల రూపాయల నష్టం జరుగుతోందని ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా దుమ్ము, పొగ కాలుష్యం పెరిగిపోవడంతో గ్రామ ప్రజలు శ్వాస సంబంధిత సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. చెరువుల మట్టి తవ్వకాలు భవిష్యత్ వ్యవసాయానికి తీవ్రమైన ప్రమాదంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది అధికారులపై ఆరోపణలు - విచారణకు డిమాండ్ అధికారుల అండతోనే ఈ వ్యవహారం



కొనసాగుతోందనే అనుమానాలు ప్రజల్లో బలపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరపాలని బీఎస్పీ డిమాండ్ చేసింది. అక్రమ బట్టీలపై కేసులు నమోదు చేయడంతో పాటు పర్యావరణ నష్టంపై నివేదిక విడుదల చేయాలని కోరింది.

## జొన్నల కొనుగోలు కేంద్రాన్ని

# ప్రారంభించిన ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 26, నారాయణఖేడ్ :** రైతన్నలు పండించిన ప్రతి గింజకూ సరైన న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం నాడు నారాయణఖేడ్ మండల పరిధిలోని ర్యాకల్ గ్రామంలో గల రైతు వేదికలో, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పి ఏ సి యస్ ) ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి, రిబ్బన్ కట్ చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి మాట్లాడుతూ...రైతులు తాము పండించిన జొన్న పంటను తక్కువ ధరకే అమ్ముకొని నష్టపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం మద్దతు ధరతో ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రభుత్వం జొన్నలకు క్వింటాలుకు ?3,699 మద్దతు ధరను నిర్ణయించిందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓపెన్ మార్కెట్‌లో దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు అమ్ముకోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని, తూకాల్లో ఎలాంటి అక్రమాలు జరగకుండా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను, సొసైటీ నిర్వాహకులను ఆదేశించారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, నియోజకవర్గంలోని ప్రతి రైతుకూ అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ డి ఏ నూతన్ కుమార్, ఏ ఈ ఓ రఘు, జ్ఞానేశ్వర్, ప్రతాప్ రెడ్డి, కిషన్ నాయక్,లక్ష్మి మోహన్ రెడ్డి, కర్ర సక్రి బాయి గుండ్య నాయక్, శ్రీధర్ రెడ్డి సర్పంచ్లు, జైపాల్ ఉప సర్పంచ్, రమేష్ చౌహాన్ మాజీ ఎంపీపీ, పండరి రెడ్డి, దత్తు గౌడ్ మాజీ ఎంపీటీసీలు,రాజు మాజీ సర్పంచ్, వెంకట్ రెడ్డి,నరసింహ రెడ్డి,స్థానిక ప్రజాప్రతినిధులు,



సహకార సంఘం (పి ఏ సి యస్ ) అధ్యక్షులు, కార్యదర్శి, వ్యవసాయ శాఖ అధికారులు, సొసైటీ డైరెక్టర్లు మరియు పరిసర ప్రాంతాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మండుటెండలో పని చేస్తున్న

# ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

**సమస్యలు పరిష్కరించకపోతే ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తాం**

**వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జూకంటి పౌలు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్,మే 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలంలోని దూది వెంకటాపురం, నమిలే గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పని ప్రదేశాల్లో కూలీలతో మాట్లాడిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జూకంటి పౌలు వ రా ట్లా డ ు త ూ రా . . . . మండుటెండల్లో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్నప్పటికీ, కూలీలకు అవసరమైన కనీస సౌకర్యాలు అందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పని జరిగే ప్రదేశాల్లో కూలీలు సేదతీరేందుకు నీడ, దాహం తీర్చుకునేందుకు తాగునీరు, అత్యవసర పరిస్థితుల్లో చికిత్స అందించేందుకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉదయం 8 గంటల నుంచే ఉష్ణోగ్రతలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో, గ్రామాలకు మూడు నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న పని ప్రదేశాలకు కాలినడకన వెళ్లి కూలీలు పనులు చేయాల్సి వస్తోందని అన్నారు. పంటల సీజన్ పూర్తయిన అనంతరం ఉపాధి హామీ పనులపై ఆధారపడుతున్న గ్రామీణ కూలీలకు గ్రామాల వారీగా పనులు కల్పిస్తున్నప్పటికీ, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు లేకపోవడం పలు విమర్శలకు తావిస్తోందన్నారు. కూలీలు గ్రామాల నుంచి మంచినీరు తెచ్చుకుని పనులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, సంబంధిత అధికారులు సమస్యను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. పని ప్రదేశాలకు సమీపంలో చెట్లు లేకపోవడంతో కూలీలు ఎండలోనే పని చేయాల్సి వస్తోందని, కొన్ని చోట్ల ఒకటి లేదా రెండు నీటి క్యాన్లతో సరిపెడుతున్నారని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి తాగునీరు, విశ్రాంతి కోసం నీడ, వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. అదేవిధంగా ఉపాధి కూలీలకు సంవత్సరానికి 200 రోజుల పని కల్పించాలని, రోజువారీ వేతనం రూ. 600కు పెంచాలని, పట్టణ ప్రాంతాల్లోని పేదలకు కూడా ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. పని ప్రదేశాల్లో రోజుకు రెండు పూటల ఫోటోలు తీసే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కట్టా రవి, నీలం బిక్షపతి, పులి బాబు, పరమేష్ కొలనుపాక బాలయ్య, రేష్మ, నీలం రజిత, ఎండి సమీరా, సయ్యద్ నజీయా, కట్కూరి లక్ష్మి, చిన్న అలివేలు, గంజి మురళి, దండు కళ్యాణి, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

# ఖాదీకి కొత్త ఊపు.. రూ.1.87 లక్షల కోట్ల అమ్మకాలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 26, సెంట్రల్ బ్యూరో:** ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల రంగం 2025-26 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయి వృద్ధిని నమోదు చేసింది. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తుల అమ్మకాలు తొలిసారిగా రూ. 1.87 లక్షల కోట్ల మార్కును దాటినట్లు ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కెవిఐసి) వెల్లడించింది. న్యూఢిల్లీలోని రాజ్‌ఘాట్ గాంధీ దర్శన్‌లో మంగళవారం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తాత్కాలిక గణాంకాలను కెవిఐసి ఛైర్మన్ మనోజ్ కుమార్ విడుదల చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 'ఆత్మనిర్భర్ భారత్', 'వోకల్ ఫర్ లోకల్', 'లోకల్ టు గ్లోబల్' కార్యక్రమాల ప్రభావంతో ఖాదీ రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త శక్తినిచ్చిందని ఆయన పేర్కొన్నారు. 2013-14తో పోలిస్తే గత 12 ఏళ్లలో అమ్మకాలు 501 శాతం, ఉత్పత్తి 380 శాతం, ఉపాధి 56 శాతం పెరిగినట్లు తెలిపారు. 2013-14లో రూ. 31,154 కోట్లుగా ఉన్న అమ్మకాలు 2025-26లో రూ. 1,87,105 కోట్లకు చేరగా, ఉత్పత్తి విలువ రూ. 26,109 కోట్ల నుంచి రూ. 1,25,296 కోట్లకు పెరిగిందన్నారు. ఖాదీ వస్త్రాల అమ్మకాలు రూ. 1,081 కోట్ల నుంచి రూ. 7,869 కోట్లకు పెరిగి 628 శాతం వృద్ధి నమోదు చేశాయని చెప్పారు. గ్రామీణ పరిశ్రమల రంగంలో ఉపాధి అవకాశాలు కూడా గణనీయంగా పెరిగినట్లు తెలిపారు. 2013-14లో 1.30 కోట్లుగా ఉన్న ఉపాధి 2025-26లో 2.04 కోట్లకు చేరిందన్నారు. పిఎంఈజీపీ పథకం కింద ఈ ఏడాది 66,494 కొత్త యూనిట్లు స్థాపించగా, వాటి ద్వారా 7.31 లక్షల మందికి ఉపాధి లభించినట్లు వెల్లడించారు. గ్రామోద్యోగ వికాస్ యోజన కింద కళాకారులకు పెద్ద ఎత్తున యంత్రాలు, టూల్‌కిట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. మహిళా సాధికారతలో భాగంగా శిక్షణ కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యం



59 శాతానికి చేరిందన్నారు. కళాకారుల పారితోషికం ఒక్క హ్యాంక్‌కు రూ. 4 నుంచి రూ. 15కు పెరిగి 275 శాతం వృద్ధి నమోదైందని పేర్కొన్నారు. ప్రభుత్వ కొనుగోళ్లు, ప్రదర్శనల అమ్మకాలు, జాతీయ జెండాల డిమాండ్ పెరగడం ఖాదీపై ప్రజల విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోందన్నారు.

# 13వ వార్డులో ప్రతి ఇంటికి మంజీరా నీరు : కౌన్సిలర్ అంజలి దుర్గారెడ్డి

**ఇంద్రేశం మున్సిపాలిటీలో శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి భారీ చర్యలు**



**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 26**

ఇంద్రేశం మున్సిపాలిటీ 13వ వార్డులో మంజీరా నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తూ కౌన్సిలర్ అంజలి దుర్గారెడ్డి కీలక చర్యలు చేపట్టారు. ప్రజలకు ఎలాంటి నీటి ఇబ్బందులు లేకుండా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన మంజీరా నీరు అందించాలనే లక్ష్యంతో ప్రత్యేక పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. ఇంద్రేశం పిఎన్ఆర్ టౌన్షిప్ కాలనీలో రోడ్ నెంబర్--25 వద్ద, ఏఎంఆర్ విజన్ అవెన్యూ అపార్ట్‌మెంట్ సమీపంలో సుమారు 150 మీటర్ల పొడవున మంజీరా నీటి పైప్‌లైన్ ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులతో కాలనీవాసులకు ఎన్నో రోజులుగా ఉన్న నీటి సమస్యకు ఉపశమనం లభించనుంది. ఈ సందర్భంగా కౌన్సిలర్ అంజలి దుర్గారెడ్డి మాట్లాడుతూ,"వేసవికాలంలో ప్రజలకు నీటి ఇబ్బందులు రాకుండా ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు కట్టుబడి ఉన్నాం. 13వ వార్డులో ప్రజల సమస్యలను మా కుటుంబ సమస్యలుగా భావించి వెంటనే స్పందిస్తున్నాం. ప్రజలకు అవసరమైన ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని మున్సిపాలిటీ అధికారులతో సమన్వయం చేసుకుని వేగంగా పూర్తి చేస్తాం" అని తెలిపారు. అలాగే ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సహకారంతో 13వ వార్డులో అభివృద్ధి పనులు మరింత వేగవంతం అవుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి గల్లీ, ప్రతి కాలనీలో మంజీరా నీటి సమస్యలతో పాటు ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిఎన్ఆర్ టౌన్షిప్ అసోసియేషన్ సభ్యులు మరియు, కాలనీవాసులు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

**తృణమూల్ కాంగ్రెస్ లో భారీ సంక్షోభం..!**

# దీదీకి వరుసగా నేతల గుడ్ బై..!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 26, కలకత్తా:**

పశ్చిమ బెంగాల్‌లో తాజాగా జరిగిన ఎన్నికల్లో బీజేపీ చేతిలో ఘోర పరాజయం పాలైన తృణమూల్ కాంగ్రెస్ టీఎంసీ క్రమంగా తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతోంది. తాజాగా దాదాపు వంద మంది టీఎంసీ కౌన్సిలర్లు తమ పదవులకు రాజీనామా చేయడంతో పార్టీకి కష్టాలు మరింత పెరిగాయి. క్షేత్ర స్థాయిలోని కల్లోలం సీనియర్ నాయకులలోనూ కనిపిస్తోంది. పలువురు బహిరంగంగానే మమతా బెనర్జీ నాయకత్వాన్ని ధిక్కరిస్తున్నారు. టీఎంసీ చరిత్రలోనే ఇది అత్యంత క్లిష్టమైన సమయంగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**తృణమూల్ లో సంక్షోభం:**

ఒకప్పుడు తిరుగులేని శక్తిగా వెలుగొందిన తృణమూల్ కాంగ్రెస్, ఒక్క ఓటమితో పూర్తిగా బలహీనపడినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. బెంగాల్ ఎన్నికల ఓటమి తర్వాత లోక్‌సభ ఎంపీ కకోలి ఘోష్ దస్తిదార్ వంటి సీనియర్ నేతలు తమ అసంతృప్తిని బహిరంగంగా వెళ్లగక్కుతున్నారు. మరోవైపు టీఎంసీ నియంత్రణలో ఉన్న స్థానిక సంస్థల్లో పెద్ద ఎత్తున రాజీనామాలు జరుగుతున్నాయి. గత కొన్ని రోజులుగా వివిధ మునిసిపాలిటీలకు చెందిన సుమారు 100 మంది కౌన్సిలర్లు రాజీనామాలు సమర్పించారు. ఈ రాజకీయ ప్రకంపనలు టీఎంసీ ఆధీనంలో ఉన్న మున్సిపల్ కార్పోరేషన్లు, మున్సిపాలిటీల్లో బీజేపీకి బలపడే అవకాశాన్ని కల్పిస్తున్నాయి.

**స్థానిక ఎన్నికలకు ముందే రాజీనామాల పర్వం**

రాజకీయ సంక్షోభం తీవ్రత ఎంతగా ఉందంటే, వచ్చే ఏడాది స్థానిక ఎన్నికలకు జరగకముందే పలు మునిసిపల్ బోర్డులు రద్దు అయ్యే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. ఆజ్‌తక్ బంగ్లా నివేదిక ప్రకారం, మమతకు సన్నిహితుడు, కోల్‌కతా మేయర్ ఫిర్హాద్ హకీమ్ కూడా తన పదవికి రాజీనామా చేయాలనుకుంటున్నట్లు తెలుస్తోంది. కౌన్సిలర్లు రాజీనామాలు చేయవద్దని మమత తాజాగా విజ్ఞప్తి చేసినా.. బెంగాల్ స్థానిక సంస్థలలో ప్రతిరోజూ ఏదో ఒక రూపంలో అవి కొనసాగుతూనే ఉన్నాయి. మమతా బెనర్జీ 1998లో కాంగ్రెస్ నుండి విడిపోయి టీఎంసీని స్థాపించినప్పటి నుండి ఎదుర్కొన్న అతిపెద్ద సంక్షోభం ఇదే.

**సువేందు హెచ్చరికల ఫలితమేనా.?**

సువేందు అధికారి ప్రభుత్వం గత స్థానిక సంస్థల కార్యకలాపాలను పూర్తిగా పరిశీలిస్తుందని, దాని ప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేసిన తర్వాత రాజీనామాల పరంపర మొదలైంది. కొన్ని మునిసిపాలిటీలలో టీఎంసీ కౌన్సిలర్లు తమ కార్యాలయాలకు వెళ్లడం కూడా పూర్తిగా మానేశారు. అక్కడ ప్రభుత్వం అధికారుల్ని నియమించడం ప్రారంభించింది. ఇదే క్రమంలో టీఎంసీకి చెందిన కౌన్సిలర్లపై అవినీతి, వసూళ్ల ఆరోపణలతో వరుస అరెస్టులు పార్టీలో మరింత ఆందోళనను పెంచాయి. గత వారం, ముగ్గురు కౌన్సిలర్‌లు వసూళ్లు,బెదిరింపుల ఆరోపణలపై అరెస్టు అయ్యారు. ఈ పరిణామాలు టీఎంసీకి పెద్ద దెబ్బగా మారాయి.

## ఆర్థిక సాయం చేసిన స్నేహితులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం చల్లూరు గ్రామానికి చెందిన ఇంజ ఇస్తారి మృతి చెందగా ఆయన పెద్ద కుమారుడు ఇంజ మహేష్ తోటి 2010 -11 ఎస్ఎస్సి బ్యాచ్ స్నేహితులు మంగళవారం పరామర్శించి 16 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు.

## బాలమ్మ కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన రంగ నరేష్ గౌడ్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం పాముకుంట గ్రామానికి చెందిన వట్టిపల్లి బాలమ్మ మరణించగా కుటుంబానికి సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు స్థానిక సర్పంచి రంగ నరేష్ గౌడ్ మంగళవారం ఐదువేల రూపాయల ఆర్థిక సాయం అందజేసి పరామర్శించారు. తన వెంట వార్డు సభ్యులు బత్తిని పాండు, బచ్చాల శేఖర్, రఘుపతి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు

## బాల్యవివాహాలను అరికట్టాలి : సర్పంచ్ కర్రే వెంకటేష్



**హైదరాబాద్ పల్స్ న్యూస్,మే 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** బాల్య వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని రాజపేట మండలం రేణికుంట గ్రామ సర్పంచ్ కర్రే వెంకటేష్ పిలుపునిచ్చారు. మంగళవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలపై నిర్వహించిన అవగాహన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో ఉపసర్పంచ్ బొల్ల హర్షవర్ధన్ రెడ్డి, వార్డు సభ్యులు గోర్రె మల్లేశం, సత్య కళ, భబిత, కళ్యాణి, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ పాండురంగ స్వామి, రంగయ్య, దేవిక, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ విత్తనాల విక్రయాలు నిర్వహించినా వాటిని ప్రోత్సహించినా కఠిన చర్యలు....

### సన్న రకాల వరి విత్తనాలను ప్రోత్సహించాలి....

### రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి




**హైదరాబాద్ పల్స్ న్యూస్,మే 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లాలో ఎక్కడా కల్తీ విత్తనాల విక్రయాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లాలోని విత్తనాలు, ఎరువుల డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సన్న రకాల వరి విత్తనాలను ప్రోత్సహించాలని డీలర్లకు సూచించారు. కల్తీ విత్తనాల విక్రయాలు నిర్వహించినా, వాటిని ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పత్తిలో హెచ్‌డీ కాటన్‌ను ప్రభుత్వం నిషేధించిందని, జిల్లాలో ఎక్కడా విక్రయాలు జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. యూరియా వినియోగాన్ని తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలని, యాప్ ద్వారా యూరియా బుకింగ్ జరిగేలా చూడాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. నానో యూరియాను ప్రోత్సహించాలని, రైతులకు అవగాహన కల్పించి సాధారణ యూరియా వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి రమణారెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు, వ్యవసాయ అధికారులు, విత్తనాలు మరియు ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

# సింగారం రైతుల ఆగ్రహం....

**సబ్ మార్కెట్ యార్డుకు తాళం....**
**ధాన్యాన్ని దగ్ధం చేసి నిరసన.....**
**ఎస్ఐ చొరవ పిఏసిఎస్ సీఈవో హామీతో విరమణ**



**హైదరాబాద్ పల్స్ న్యూస్,మే 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని ఐకెపి కేంద్రం ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ బుధవారం రాజపేట మండలం సింగారం గ్రామానికి చెందిన రైతులు రాజపేట లోని ఆలేరు వ్యవసాయ మార్కెట్ సబ్ యార్డ్ గోదాము ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గోదాము గేటుకు తాళం వేసి గేటు ముందు బైఠాయించి నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. ధాన్యం బస్తాను దగ్ధం చేసి ప్రభుత్వానికి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గతంలో కంటే ఈసారి మూడు రెట్లు ధాన్యం పండిందని 70 లారీల ధాన్యం పండగా కేవలం 15 లారీల ధాన్యం మాత్రమే మిల్లుకు తరలించడం జరిగిందని మరో రెండు వందల కుప్పల ధాన్యం ఐకెపి కేంద్రంలోనే ఉందని రైతులు చెప్పారు. నెల రోజులు దాటిన ధాన్యం కొనుగోలులో శ్రద్ధ చూపకపోవడంతో వేగంగా సాగడం లేదని రైతులు ఆరోపించారు. క్వింటాలుకు మూడున్నర కిలోల ధాన్యం ఎక్కువ తూకం వేయడంతో పాటు బస్తాకు రెండు రూపాయలు వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. సింగారం గ్రామం పై నిర్లక్ష్యం వహించడం వల్లనే కొనుగోలు పూర్తిగా ఆలస్యం అవుతుందని రైతులన్నారు. ఏ సమయంలో నైనా అకాల వర్షం పడే పరిస్థితులు ఉన్నాయని దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతారని మాజీ సర్పంచ్ కర్ల కరుణాకర్ రెడ్డి హెచ్చరించారు. అధికారుల పాలకుల నిర్లక్ష్యం వల్ల ధాన్యం కొనుగోలు ఆలస్యం అయితే తడిసిన ధాన్యాన్ని కూడా తప్పకుండా షరతులు లేకుండా కొనుగోలు చేయాలని కరుణాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. గేటు ముందు ధాన్యం బస్తా దగ్ధం చేసి నిరసన చేస్తుండగా ఎస్ఐ లింగారెడ్డి రైతులకు నచ్చజెప్పారు. రేణికుంట పిఏసిఎస్ సీఈవో సిలువేరు శేఖర్ హామీ మేరకు రైతులు తమ నిరసన ధర్నాను విరమించుకున్నారు. ధాన్యం కొనుగోలు, రైస్ మిల్ లకు తరలింపులో వేగం పెంచకపోతే మూడు రోజుల్లో కలెక్టర్ కార్యాలయం ముందు తమ ఆందోళన చేపట్టనున్నట్లు రైతుల పక్షాన కర్ల కర్ణాకర్ రెడ్డి హెచ్చరించారు. బొందుగుల ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ధాన్యం బస్తాలకు



నిప్పంటించి నిరసన తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసిల్దార్ వల్లపు ప్రదీప్ సందర్శించి పరిస్థితులను చక్కబెట్టే క్రమంలో చర్యలు తీసుకున్నారు.



### సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు కార్మిక సంఘం

# ఎన్నికలు వెంటనే నిర్వహించాలి

**సిర్పూర్ పేపర్ మిల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షులు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే. మల్లికార్జున్ డిమాండ్.**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 26, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లోని సిర్పూర్ పేపర్ మీల్స్ లిమిటెడ్ లో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలని మంగళవారం నాడు అడిషనల్ లేబర్ కమిషనర్ ఈ. గంగాధర్ ని కలిసి విన్నవించినట్లు సిర్పూర్ పేపర్ మిల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షులు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే. మల్లికార్జున్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2018 ఆగస్టు నుండి జెకె పేపర్ మిల్లు యాజమాన్యం ఈ పేపర్ మిల్లును టేకోవర్ చేసిందని తెలిపారు. ప్రస్తుతం ఈ కంపెనీలో 373 మంది పర్మినెంట్ కార్మికులతో పాటు కాంట్రాక్ట్ కార్మికులు కలిపి సుమారు 2,188 మంది పనిచేస్తున్నారని చెప్పారు. కంపెనీ రీ-ఓపెన్ అయి సుమారు 7 సంవత్సరాలు పూర్తయినా ఇప్పటికీ గుర్తింపు యూనియన్ లేకపోవడం వల్ల కార్మికుల వేతన ఒప్పందాలు, ఇతర సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ అధికారులను అనేకసార్లు కలిసి విన్నవించినప్పటికీ యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోందని, దీంతో అన్ని కార్మిక సంఘాలు జేఏసీగా ఏర్పడి పరిశ్రమ ముందు రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. పేపర్ మిల్ యాజమాన్యం గుర్తింపు ఎన్నికలు నిర్వహించడానికి సహకరించడం లేదని, పైగా హైకోర్టులో రిట్ పిటిషన్ నెం. 3966/2026 దాఖలు చేసిందని పేర్కొన్నారు. ఇండస్ట్రియల్ రిలేషన్ కోడ్--2020 సెక్షన్ 14(1) నుండి (4) వరకు ప్రకారం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌కు గుర్తింపు ఎన్నికలు నిర్వహించే అధికారం లేదని యాజమాన్యం వాదిస్తోందన్నారు. అదేవిధంగా, ప్రభుత్వ తరఫున వాదిస్తున్న లేబర్ డిపార్ట్మెంట్ జీపీ కూడా యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరిస్తూ ఎన్నికల సమావేశాలు నిర్వహించవద్దని సూచించడం కార్మికుల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు. రాష్ట్రంలో ఇంకా లేబర్ కోడ్లు పూర్తిస్థాయిలో అమల్లోకి రాలేదని, అనేక పరిశ్రమల్లో పాత చట్టాల ప్రకారమే గుర్తింపు ఎన్నికలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. అదే విధంగా ఈ పరిశ్రమలో కూడా వెంటనే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎస్పీఎంలో గుర్తింపు ఎన్నికలు జరపాలని అన్ని కార్మిక సంఘాలు కోరుతున్నాయని, జేసీఎల్ మరియు డీసీఎల్ అధికారులు ఇప్పటికే కార్మిక సంఘాలతో సమావేశాలు నిర్వహించారని తెలిపారు. అయితే యాజమాన్యం మాత్రం ఎన్నికలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. లేబర్ కమిషనర్ వెంటనే జోక్యం చేసుకొని, ప్రభుత్వ జీపీ ద్వారా కోర్టు వ్యవహారాన్ని ఉపసంహరించుకునేలా చర్యలు తీసుకొని, గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు పాల్గొన్నారు.



## హైదరాబాద్ లో ఎబోలా వైరస్ భయం.. శంషాబాద్ ఎయిర్ పోర్టులో హై అలర్ట్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 26, సెంట్రల్ బ్యూరో:**
ప్రపంచ దేశాల్ని ఎబోలా వైరస్ వణికిస్తోంది. ముఖ్యంగా ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వైరస్ వేగంగా విస్తరిస్తోంది. ఇప్పటికే ఎబోలాను అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనకరమైన పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీగా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. దేశవ్యాప్తంగా అన్ని అంతర్జాతీయ ఎయిర్ పోర్టుల్లో మెడికల్ టీమ్ లను మోహరిస్తోంది కేంద్ర ప్రభుత్వం. వివిధ దేశాల నుంచి వచ్చిన ప్రయాణికులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇక ఇదే విషయంపై కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. దేశంలో ఇప్పటివరకూ ఒక్క ఎబోలా వైరస్ కేసు కూడా నమోదు కాలేదని వెల్లడించారు. వైరస్ వ్యాప్తిని నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇక హైదరాబాద్ లోని శంషాబాద్ ఎయిర్ పోర్టులో హై అలర్ట్ ప్రకటించారు అధికారులు. ఎబోలా వైరస్ నేపథ్యంలో ఎయిర్ పోర్టులో ప్రయాణికులకు థర్మల్ స్కానర్లు, హెల్త్ చెకప్ లతో తనిఖీలు నిర్వహిస్తున్నారు. జ్వరం, వాంతులు, బలహీనత లక్షణాలు ఉన్న అనుమానితులను ఐసోలేషన్ కు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు రాష్ట్రంలో ఎబోలా కేసులు నమోదు కాలేదని.. ఎబోలా లక్షణాలు ఉన్న వ్యక్తులను కూడా ఇప్పటివరకు గుర్తించలేదని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు రాష్ట్రంలో అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ముఖ్యంగా ఆఫ్రికా ఖండంలోని దేశాలైన డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, సౌత్ సూడాన్ వంటి ఎబోలా బాధిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికులను శంషాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలోనే స్క్రీనింగ్, థర్మల్ స్కానింగ్ చేస్తూ వారిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. విమానాశ్రయంలో డాక్టర్లు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, ఫీల్డ్ స్టాఫ్, పారామెడికల్ సిబ్బందితో ప్రత్యేక బృందం విధులు నిర్వహిస్తోందని అన్నారు. అత్యవసర పరిస్థితుల కోసం 108 అంబులెన్స్‌లను 24 గంటలపాటు అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు. అలాగే గాంధీ హాస్పిటల్ లో 10 పడకల ప్రత్యేక ఐసోలేషన్ వార్డును ఇప్పటికే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక అనుమానితుల సాంపిల్స్ టెస్ట్ చేయడం కోసం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ, పుణేకు సాంపిల్స్ పంపించనున్నారు వైద్యులు.




### రూ.30 లక్షల లంచం డిమాండ్..

# శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 26, శామీర్‌పేట :**
మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. రంగారెడ్డి ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ తనిఖీలు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. శామీర్‌పేట మండలం ఆలియాబాద్ ప్రాంతంలో సుమారు 30 ఎకరాల భూమి కన్వర్షన్‌కు సంబంధించి రైతు కన్సల్టెంట్ నుంచి భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేసినట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు దర్యాప్తు చేపట్టినట్లు డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపారు. ఎకరానికి రూ.1 లక్ష చొప్పున మొత్తం రూ.30 లక్షలు డిమాండ్ చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. ఈ వ్యవహారంలో తహసీల్దార్ డ్రైవర్ ద్వారా రూ.2 లక్షలు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు వెల్లడించారు. కార్యాలయంలోని కీలక పత్రాలు, భూ అనుమతులకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నామని చెప్పారు. ఎమ్మార్వో సుచరితతో పాటు కీసర ఆర్డీవో రాజేష్, పలువురు సిబ్బందిని విచారిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, 2024లో కూడా శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసిన ఎమ్మార్వో సత్యనారాయణ డ్రైవర్‌తో కలిసి రూ.2 లక్షల లంచం కేసులో ఏసీబీకి చిక్కిన ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. తాజాగా మరోసారి అదే కార్యాలయంలో ఏసీబీ దాడులు జరగడంతో జిల్లాలో చర్చనీయాంశమైంది.



# మోత్కూర్ లో బీసీ ఉద్యోగుల బహిరంగ సభ....

**క్రిమిలేయర్ నిబంధన ఎత్తి వేయాలి.....**
**రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య**







**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని బీసీ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్ నిబంధన ఎత్తి వేయాలని మోతుకూరు లో బీసీ ఉద్యోగుల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ... బీసీ ఉద్యోగులకు ప్రమోషన్ రిజర్వేషన్లు కల్పించడానికి పార్లమెంటులో రాజ్యాంగ సవరణ బిల్లు పెడతామన్నారు బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టడానికి చట్టపరమైన, రాజ్యంగా పరమైన, న్యాయపరమైన అవరోధాలు, అడ్డంకులు ఏమీలేవు. రాజ్యాంగ బద్ధమైన మండల్ కమీషన్ బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సు చేసింది. చట్టబద్ధమైన పార్లమెంటరీ కమిటీ చైర్మన్ నాచియప్పన్ కమిటీ బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సు చేసింది. ఇటీవల సుప్రీంకోర్టు ఉత్తరప్రదేశ్ రిజర్వేషన్ల కేసు సందర్భంగా జనాభా ప్రకారం ఉద్యోగుల సంఖ్య లేకపోతే ఎస్సి/ఎస్టి/బిసి లకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని తీర్పు చెప్పింది. అన్ని వైపుల నుంచి బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని బలమైన సిఫార్సులున్నాయి. అయినప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. విద్యా, ఉద్యోగ నియామకాలలో బిసి రిజర్వేషన్ల పై క్రిమిలేయర్ నిబంధన విధించిన తీరు బిసి ల పై వివక్ష, చిన్న చూపు చూస్తున్నట్లు స్పష్టంగా కన్పిస్తుంది. ఆరు రిజర్వేషన్ల వర్గాలు ఎస్సి/ ఎస్టీ/ వికలాంగులు/ ఎన్.సి.సి / మహిళ రిజర్వేషన్లకు లేని క్రిమిలేయర్ బిసి లకే ఎందుకు విధించారు? రిజర్వేషన్ల లక్ష్యం అర్ధికాభివృద్ధి కాదు. పాలన లో బిసి లకు భాగస్వామ్యం కల్పించడం ఒకటైతే రిజర్వేషన్ల ద్వారా చదువు, ఉద్యోగం తద్వార అధికారంలో ఈ వర్గాల సామజిక హోదా పెంచడం ఇంకొక భాగం. కాని అర్ధం పర్ధం లేని క్రిమిలేయర్ బిసి లకే ఎందుకు? ఇది బిసి ల పట్ల వివక్షత కాదా? ప్రభుత్వాలు ఇంత చిన్న విషయంలో కూడా బిసి లకు అన్యాయం చేశారని విమర్శించారు. పార్లమెంట్ లో బిసి బిల్లు పెట్టి అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలలో 50 శాతం రిజర్వేషన్లు పెట్టాలి. కేంద్రంలో బిసి లకు ప్రతేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి 2 లక్షల కోట్లతో ప్రతేక అభివృద్ధి పథకం ప్రకటించాలి. బిసి ల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను 25 శాతం నుంచి 50 శాతం పెంచాలి. బి.సి లకు పారిశ్రామిక పాలసీ లో 50 శాతం కోటా ఇవ్వాలి. హై కోర్టు సుప్రీంకోర్టు జడ్జిల నియమాకంలో ఎస్సి/ఎస్టి/బిసి -రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలి. ప్రైవేటు రంగంలో ఎస్సి/ఎస్టి/బిసి లకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలి. కేంద్రంలో ఖాలిగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలి అని అన్నారు. ఈ సమావేశంలో విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు కుమారస్వామి, ముత్యం వెంకన్న, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేష్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్ యాదవ్, యాదగిరి, కళాబృందం రామలింగం, డప్పు స్వామి కలిమల నరసింహ, ఎడ్ల మహాలింగం, నరేష్ ముదిరాజ్, అంజి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# భారత్ లో ఉన్న 7 సీక్రెట్ గోల్డ్ మైన్స్ ఇవే..

## షాకింగ్ విషయాలు వెలుగులోకి..!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 26 :**
భారతీయులకు బంగారం అంటే ఓ ఎమోషన్ అన్న విషయం తెలిసిందే.. పెళ్లి అయినా మరే ఫంక్షన్ అయినా ముందుగా బంగారం కొనేస్తుంటారు. ఓ శుభకార్యానికి వెళ్లినా ఒంటి నిండా నగలతో వెళ్లాలని చాలామంది మహిళలు కలలు కంటూ ఉంటారు. కానీ దేశంలో బంగారం ధరలు చూస్తే మాత్రం మైండ్ బ్లాంక్ అవుతోంది. ప్రస్తుతం హైదరాబాద్ లో తులం బంగారం ధర రూ. 1,45,000 పైగానే ఉంది. దాంతో ఈ రోజుల్లో బంగారం కొనాలంటేనే వామ్మో అని బెంబెలెత్తిపోయే పరిస్థితి నెలకొంది. ప్రపంచవ్యాప్తంగా బంగారానికి విపరీతంగా డిమాండ్ పెరిగిపోయిన నేపథ్యంలో భారత్ లోని 7 సీక్రెట్ గోల్డ్ మైన్స్ గురించి మీకు తెలుసా..? ఈ రహస్య బంగారు గనుల గురించి చాలా తక్కువ మందికి తెలిసి ఉంటుంది.కోలార్ గోల్డ్ ఫీల్డ్స్(కర్ణాటక) ఇది భారత్ లోని పురాతనమైన బంగారు గనిగా ప్రసిద్ధి చెందింది. అలాగే ఇది దేశంలోనే లోతైన బంగారు గని. బ్రిటిష్ పాలనలో 1880 లో ఈ గని ప్రారంభం అయింది. పర్యావరణ, ఆర్థిక కారణాల వల్ల 2001 లో ఈ గని మూతపడింది. అప్పటివరకు ఈ గని దాదాపు 800 టన్నుల బంగారాన్ని ఉత్పత్తి చేసింది. ఇక కర్ణాటకలోనే హట్టి గోల్డ్ మైన్స్ కూడా ఉన్నాయి. కర్ణాటకలోని రాయచూర్ జిల్లాలో ఇది ఉంది. ప్రస్తుతం భారత్ లో యాక్టివ్ లో ఉన్న ఏకైన బంగారం గని ఇదే. ఈ గనికి 2వేలకు పైగా చరిత్ర ఉంది. ఇది ప్రతి సంవత్సరం సుమారు 1.8 టన్నుల బంగారాన్ని ఉత్పత్తి చేస్తుంది.అలాగే ఉత్తర్ ప్రదేశ్ లోని సోన్ భద్ర గోల్డ్ మైన్స్.. 2020 లో ఇక్కడ భారీగా బంగారం నిక్షేపాలు బయటపడినప్పుడు ఇది దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచింది. జియోలాజికల్ నిపుణుల అంచనా ప్రకారం.. ఇక్కడ వివిధ ప్రాంతాల్లో దాదాపు 700 టన్నుల బంగారు ఖనిజం ఉంది. అలాగే బంగారంతో పాటు ఇక్కడ వెండి, రాగి, ఇనుము నిక్షేపాలు కూడా ఉన్నాయి. కర్ణాటకలోని గనజూర్ గోల్డ్ మైన్.. ఇది ప్రముఖ మైనింగ్ ప్రాజెక్ట్ గా మారాల్సి ఉంది. డెక్కన్ గోల్డ్ మైన్స్ సంస్థ ఇక్కడ వాణిజ్యపరమైన ఉత్పత్తిని ప్రారంభించాలని భావించింది. కానీ దీని మైనింగ్ లీజును ప్రభుత్వం తిరస్కరించింది.జొన్నగిరి గోల్డ్ మైన్.. ఇది కర్నూలు జిల్లాలో ఏపీ- తెలంగాణ సరిహద్దు దగ్గరలో ఉంది. ఇది భారత్ లోని మొదటి ప్రైవేట్ ఓపెన్ పిట్ బంగారు గనిగా మారబోతుంది. దీనిని కూడా డెక్కన్ గోల్డ్ మైన్స్ సంస్థ మద్దతుతో అభివృద్ధి చేస్తున్నారు. ఇది ఏడాదికి దాదాపు 1.2 టన్నుల బంగారాన్ని ఉత్పత్తి చేయగలదని అంచనా.. అలాగే జార్ఖండ్ లోని లావా గోల్డ్ మైన్.. ఏపీ, అనంతపురం జిల్లాలోని రామగిరి గోల్డ్ మైన్ కూడా ఉంది. బ్రిటిష్ కాలంలో 1905 నుంచి 1927 మధ్య ఇక్కడ మైనింగ్ జరిగింది. ఈ ప్రాంతంలో బంగారంతోపాటు రాగి, సీసం, జింక్ నిక్షేపాలు కూడా ఉన్నాయని నమ్ముతారు.



# మెడికల్ మిరాకిల్.. చైనా నుంచి హైదరాబాద్ పేషెంట్‌కు రిమోట్ రోబోటిక్ సర్జరీ

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 26, మెయిన్ డెస్క్ :**
వైద్యరంగంలో మరో అద్భుతం..వేల కిలోమీటర్ల దూరం ఇక చికిత్సకు అడ్డుకాదని నిరూపిస్తూ చైనాలో ఉన్న వైద్యులు హైదరాబాద్‌లోని ఓ పేషెంట్‌కు విజయవంతంగా రిమోట్ సర్జరీ నిర్వహించారు. దాదాపు 3 వేల కిలోమీటర్ల దూరంలో ఉండి అత్యాధునిక టెక్నాలజీ సాయంతో ఈ ఆపరేషన్ పూర్తి చేయడం వైద్యరంగంలో కొత్త అధ్యాయం. దీనికి సంబంధించిన నెట్టింట వీడియో వైరల్ అవుతోంది. ఈ సర్జరీ సక్సెస్ తో భవిష్యత్‌లో దూర ప్రాంతాల రోగులకు కూడా నాణ్యమైన వైద్య సేవలు మరింత అందుబాటులోకి వచ్చే అవకాశాలపై ఆశలు పెరిగాయి.చైనాలోని వుహాన్‌లో పనిచేస్తున్న భారతీయ యూరాలజిస్ట్ డాక్టర్ సయ్యద్ మహమ్మద్ గౌస్..3వేల కిలోమీటర్ల దూరంలో భారతదేశంలోని హైదరాబాద్‌లో ఉన్న సర్జరీ చేసి రోగి ప్రాణాలను కాపాడారు. రోగికి రోబోట్ సహాయంతో మూత్రనాళాన్ని తిరిగి అమర్చే సంక్లిష్టమైన శస్త్రచికిత్స అవసరమైంది. సాధారణంగా, దీనికి వైద్యుడు అదే ఆస్పత్రిలో ఉండవలసి ఉంటుంది. కానీ చైనాలో అభివృద్ధి చెందిన రోబోటిక్ వ్యవస్థలు ,అత్యంత వేగవంతమైన 5+ సాంకేతికత పుణ్యమా అని డాక్టర్ ఘౌస్.. వుహాన్ నుండే శస్త్రచికిత్స రోబోట్‌ను నియంత్రించగలిగారు. మొత్తం ఆపరేషన్ కేవలం 90 నిమిషాల్లోనే పూర్తయింది.ఇది వైద్యరంగంలో అతి పెద్ద ముందడుగు. మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు రోబోటిక్స్, 5జీ ఎలా అధునాతన చికిత్సను అందించగలవో ఇది తెలియజేస్తుంది. అలాగే ప్రాణాలను కాపాడటంలో భారత్, చైనా ఎలా కలిసి పనిచేయగలవో కూడా ఇది చూపిస్తుంది.డాక్టర్ ఘౌస్ సాధించిన విజయం కేవలం ఒక శస్త్రచికిత్సకు సంబంధించినది కాదు..ఇది భవిష్యత్తుకు ఒక సూచన. ఫ్యూచర్ లో డాక్టర్లు టెక్నాలజీ సహాయంతో సరిహద్దులు దాటి పేషెంట్లకు చికిత్స చేసి ప్రాణాలు కాపాడగలరన్న నమ్మకాన్ని పెంచింది. ఇక ఈ వీడియో చూసిన తర్వాత నెటిజన్లు డాక్టర్ ను అభినందిస్తూ కామెంట్స్ చేశారు. అంతేకాదు టెక్నాలజీ సక్సెస్ ఫ్యూచర్ ను ఎంత ప్రభావితం చేస్తుందో చర్చించారు. ఓ నెటిజన్ స్పందించి రోబోటిక్ చైనా టెక్నాలజీని అభినందిస్తూనే.. రిమోట్ రోబోటిక్ సర్జరీ చేసిన చైనాలో పనిచేస్తున్న భారతీయ డాక్టర్ సయ్యద్ మహ్మద్ ను అత్యంత స్కిల్డ్ డాక్టర్ అంటూ అభినందించారు. మరో నెటిజన్ స్పందిస్తూ.. టెక్నాలజీ, మానవ మేథస్సు కలిసి సాధించిన అద్భుతమైన సక్సెస్ అని అన్నారు. ఆపరేషన్ చేసిన డాక్టర్లకు ధన్యవాదాలు తెలిపారు నెటిజన్లు




# కొమురం బీమ్ ఆసిఫాబాద్ జిల్లా కమిషనర్ గా (ఎస్ జి ఓ)గా కుమ్మరి రాజ్ కుమార్ నియామకం

**నేషనల్ కమిషనర్ అఫ్ ఇండియా (న్యూస్ ఢిల్లీ ) అధికారిక ఉత్తర్వులుజారీ.**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 26, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం ఆసిఫాబాద్ జిల్లా 'ది స్కౌట్/గైడ్స్ ఆర్గనైజేషన్' (ఎస్ జి ఓ ) జిల్లా కమిషనర్‌గా కుమ్మరి రాజ్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు నేషనల్ కమిషనర్ ఆఫ్ ఇండియా (న్యూఢిల్లీ) మంగళవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకానికి సంబంధించిన వివరాలను తెలంగాణ రాష్ట్ర కమిషనర్ అశోక్ రాజ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లాలో స్కౌట్ మరియు గైడ్స్ విభాగం బలోపేతానికి, విద్యార్థులలో క్రమశిక్షణ, సేవా భావాన్ని పెంపొందించడానికి కుమ్మరి రాజ్ కుమార్ కృషి చేస్తారని ఆయన ఆకాంక్షించారు. కుమ్మరి రాజ్ కుమార్ నియామకం పట్ల జిల్లాలోని పలువురు విద్యావేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పలువురు అభినందనలు తెలియజేశారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జాతీయ, రాష్ట్ర కమిటీలకు కుమ్మరి రాజ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

# తాగునీటి సమస్యను పరిష్కారించిన సర్పంచ్ గర్ధాస్ విక్రమ్



**హైదరాబాద్ పల్స్ న్యూస్,మే 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామంలోని అవుసలకుంట వద్ద గ్రామపంచాయతీకి చెందిన బోర్‌మోటార్ పూర్తిగా చెడిపోవడంతో తాగునీటి సమస్య తలెత్తింది. ప్రస్తుతం వేసవికాలం కావడంతో గ్రామ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ తక్షణ చర్యలు చేపట్టారు. పాడైన మోటార్ స్థానంలో నూతన మోటార్‌ను అమర్చించి తాగునీటి సరఫరా పునరుద్ధరించారు. దీంతో గ్రామ ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా పరిష్కారం కల్పించినట్లు గ్రామస్థులు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో సర్పంచ్ చొరవ చూపడం అభినందనీయమని గ్రామ ప్రజలు పేర్కొన్నారు

# ఆఫ్రికా నుంచి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా: దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, మే 26: ఎబోలా వైరస్‌పై తెలంగాణ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎబోలా కేసులు లేవన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా ఎబోలా లక్షణాలు ఉన్న వారిని గుర్తించలేదని పేర్కొన్నారు. ఎబోలాపై రాష్ట్ర ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించిందని తెలిపారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కట్టుదిట్టమైన స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నామని వివరించారు. ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు.డీఆర్సీ, ఉగాండా, దక్షిణ సూడాన్ నుంచి వచ్చే ప్రయాణికులకు థర్మల్ స్కానింగ్ చేస్తున్నామన్నారు. ఎయిర్‌పోర్ట్‌లో ప్రత్యేక వైద్య బృందాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గాంధీ ఆస్పత్రిలో 10 పడకల ఐసోలేషన్ వార్డు ఇప్పటికే సిద్ధంగా ఉంచామన్నారు. డాక్టర్ సునీల్ కుమార్ నోడల్ అధికారిగా నియామించినట్లు చెప్పారు. అనుమానితుల సాంపుల్స్‌ను మహారాష్ట్ర పుణేలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపామన్నారు.విదేశాల నుంచి 58 మంది ప్రయాణికులు హైదరాబాద్‌కు చేరుకున్నారన్నారు. వారిలో ఎవరికీ ఎబోలా లక్షణాలు లేవని తెలిపారు. 58 మందిని 21 రోజుల పాటు హోమ్ ఐసోలేషన్‌లో అధికారులు ఉంచారని గుర్తు చేశారు. 108 అంబులెన్స్‌లను 24 గంటలు సిద్ధంగా ఉంచామని చెప్పారు. అన్ని ప్రభుత్వాసుపత్రులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులకు సూచించారు.ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ ప్రోటోకాల్స్ కచ్చితంగా అమలు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని అధికారులను ఈ సందర్బంగా మంత్రి హెచ్చరించారు. ప్రజారోగ్య రక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు.

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.